

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 137 | శనివారం 23 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


ఆర్సీబీపై సన్‌రైజర్స్ ఘనవిజయం..



## ఆస్కార్ స్థాయి నటుడు జగన్



**తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు**

**రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు**

**మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని..

# తవ్వుకో.. పంచుకో! ..



**అడ్డు అదుపులేని నేతల దందా - ట్రాక్టర్లతో భారీగా మట్టి తరలింపు**

**ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు**

నంద్యాల రూరల్ మే,22(నంది పత్రిక):- మండలంలోని కానాల, బిళ్ళలాపురం, గోస్పాడు మండలం లోని రాయపాడు గ్రామలలో అధికార పార్టీ నేతలు ఎటువంటి అను మతులు లేకుండా భారీగా మట్టి తవ్వకాలకు తెరలే పారు. చిన్న చెరువు, కానాల చెరువు, కుందూ నది ఉన్న పంచాయతీ లలో ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు గత రెండు రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా అడ్డగోలుగా మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి మాఫియాని ఎవ రైనా ప్రశ్నిస్తే వారిపై దాడులు చేస్తామని బెదిరి స్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. భారీ టిప్పర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ప్రొక్లెయిన్ల ద్వారా చెరువు, కుందూ లో మట్టి విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.8వేలకు, ట్రాక్టర్

రూ.1,500 నుంచి రెండు వేలకు అమ్మకాలు చేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. తవ్విన మట్టిని సమీప గ్రామాలకు, వెంచర్ లకు తరలిస్తున్నారు.



## హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

**జగన్ చరిత్ర తెలిసిన వారికి ఇవన్నీ అర్థం అవుతాయి**

**వైఎస్ మరణం, వివేకా మరణంపై జగన్‌వైపే అనుమానాలు**

**జగన్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు**



హత్యా రాజకీయాలు, అక్రమాల్లో ఆరితేరిన ఘనుడు జగన్ అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన చరిత్ర చూస్తే ఇదే కనిపిస్తుందని అన్నారు. ఇటీవల వైఎస్ జగన్ ఇమీడియా సమావేశంలో చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ కుటుంబంలో జరిగిన మరణాలకు సీఎం చంద్రబాబు నాయుడే కారణమంటూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ తాత వైఎస్ రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైఎస్ కుటుంబం నడిపిన దమనకాండను, అరాచకాలను ఆనాటి బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ కాలక్రమేణా తుదముట్టించారు. అయితే, రాజారెడ్డి హత్యకేసులో ఉన్న వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం.

# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

**రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం**

**తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన**

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం**

**ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం**



## వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు షాక్..

**డ్రైవర్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అనంతబాబు**

**బెయిల్ పిటిషన్ కొట్టివేసిన రాజమండ్రి స్పెషల్ కోర్టు**

**రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అనంతబాబు**



## పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక రాజకీయ కుట్ర:

**కడప జిల్లాకు చెందిన అభినయ్ కు అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందన్న అనిత**

**గిరిజనులను నమ్మించి పాస్టర్ అవతారమెత్తారని వ్యాఖ్య**

**తనపై దాడి జరిగినట్టుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారన్న అనిత**



## 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కళ్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.



**అటవీశాఖకు టార్గెట్ విధించిన డిప్యూటీ సిఎం**

## రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం..

**రాయలసీమలో 600 మెగావాట్ల సోలాం ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేష్**

**సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు**

**రూ.3000 కోట్ల పెట్టుబడితో 11 నెలల్లోనే నిర్మాణం పూర్తి**

**పరిశుభ్ర ఇంధన రంగంలో ఏపీ ముందు వరుసలో ఉందని వెల్లడి**

**రికార్డు సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ బృందానికి అభినందనలు**



## వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు షాక్..

డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు రాజమండ్రి స్పెషల్ కోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. సాక్షులను బెదిరించిన కేసులో తనకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది.తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపేస్తానంటూ ఈ కేసులోని నలుగురు కీలక సాక్షులను అనంతబాబు బెదిరించినట్లు బాధితులు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఏప్రిల్ 24న ఆయన్ను అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు, డ్రైవర్ సుబ్రమణ్యం హత్యకేసులో సాక్షుల విచారణ కోర్టులో వేగంగా సాగుతోంది. కీలక సాక్షులైన మణికంఠ, శివదుర్గాప్రసాద్‌లు ఘటన జరిగిన సమయంలో తాము చూసిన వివరాలను జడ్జికి వివరించగా, కోర్టు వారి వాంగ్మూలాలను రికార్డు చేసింది. ఈ నెల 26వ తేదీ వరకు మిగిలిన సాక్షుల విచారణ కొనసాగనుండగా.. ఆ తర్వాత ఎమ్మెల్సీ అనంతబాబును కూడా కోర్టు విచారించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ హత్యకేసులో ఆయన బెయిల్‌ను కోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే.

## పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక రాజకీయ కుట్ర:

క్రైస్తవ మత ప్రచారకుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అభినయ్ దర్శన్ వ్యవహారం వెనుక పెద్ద రాజకీయ కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాన్ని వ్యక్తం చేస్తూ, దీనిపై పోలీసులు ఇప్పటికే లోతైన విచారణ జరుపుతున్నారని ఆమె వెల్లడించారు.రాజకీయ కుట్ర కోణం లేకపోతే కడప జిల్లాకు చెందిన అభినయ్ దర్శన్... అంతదూరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని హోం మంత్రి అనిత ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను నమ్మించి ఆయన పాస్టర్ అవతారం ఎత్తారని ఆమె ఆరోపించారు. అక్కడ ఆయనపై ఎలాంటి దాడి జరగకపోయినా, జరిగినట్లుగా చిత్రీకరించి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఈ డ్రామా వెనుక ఎవరెవరు ఉన్నారనేది పోలీసుల దర్యాప్తులో త్వరలోనే పూర్తిగా బయటపడుతుందని ఆమె స్పష్టం చేశారు.అభినయ్ దర్శన్‌పై గతంలోనే పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని, సమాజంలో వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆయన నిరంతరం ప్రయత్నిస్తున్నారని హోం మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వాన్ని ఎలాగైనా అప్రదిష్ఠ పాలుచేయాలనే దురుద్దేశంతోనే ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నారా అనే యాంగిల్‌లో కూడా విచారణ సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు, కుట్రలు అస్సలు చెల్లవని, ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే తక్షణమే మానుకోవాలని ఆమె హితవు పలికారు. చట్టాన్ని అతిక్రమించి సమాజంలో అలజడులు సృష్టించాలని చూస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు అభినయ్ దర్శన్‌ను త్వరలోనే పోలీస్ కస్టడీలోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారిస్తామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

## రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం...

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (ఎస్ఏఈఎల్) 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏపీ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రికార్డు సమయంలో ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. “వ్యాపార నిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), కార్యనిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్) రెండూ కలిసిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను. ఈ రోజు, రాయలసీమలో ఎస్ఏఈఎల్ సంస్థ నిర్మించిన 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును మన ప్రజలకు అంకితం చేశాం.రూ.3,000 కోట్ల పెట్టుబడితో కేవలం 11 నెలల రికార్డు సమయంలో ఈ చరిత్రాత్మక ప్రాజెక్టును పూర్తి చేయడం జరిగింది. సుస్థిర భవిష్యత్తు పట్ల మాకున్న తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనం. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు మాకు ఎంతో గర్వకారణం.ఈ ప్రాజెక్టును ఇంత తక్కువ సమయంలో పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ ఇండియా బృందానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్టు ద్వారా మన ప్రజలకు ఉద్యోగాలు, అభివృద్ధి, కొత్త అవకాశాల రూపంలో గణనీయమైన ప్రయోజనాలు చేకూరుస్తాయని నేను మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాను“ అని చంద్రబాబు పేర్కొన్నారు.

## ఒంటిచేత్తో బహుజన విద్యా విప్లవం!

ఈ దేశంలో అణగారిన వర్గాలు బాగుపడాలంటే వారికి రెండే మార్గాలు: ఒకటి చదువు, రెండు రాజ్యాధికారం. ఈ రెండే ఇప్పటి దాకా మన సమాజంలో ఎంతోకొంత మార్పు తీసుకొచ్చాయి. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో దళితులు ఈమాత్రమైనా ఎదగడానికి చదువే వారిని ముందుకు నడిపింది. అలాంటి విద్యను ఒక ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలనే తపన పూలేఅంబేద్కర్ల కాలం నుండే ఆచరణ రూపం దాల్చింది. తెలుగు నేల మీద కూడా దళితులు, వెనకబడిన తరగతులు చదువుకోవాలనే ప్రయత్నాలు గడిచిన వందేళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. ఆంధ్రా ప్రాంతంలో క్రైస్తవ మిషనరీల వల్ల దళితులకు చదువు అందింది. తెలంగాణలో మాత్రం అది ఆలస్యమైంది. కొంత వరకు సదాలక్ష్మి, ఈశ్వరీబాయి వంటి వారు దళిత అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. ఆ తరువాత విద్యా ఉద్యమం ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి డా. అప్పికట్ల భరత్ భూషణ్. దళితుల్లో విద్యావంతులు ఉద్యోగాల్లోకి వచ్చినా, రాజకీయాల్లోకి వచ్చినా ముందు తమ ఎదుగుదల గురించే ఆలోచిస్తారు. భరత్ భూషణ్‌కు ఈ స్వార్థం తెలియదు. తాను రైల్వే శాఖలో దక్షిణ మధ్య రైల్వేకు జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగినా ఏనాడు మూలాలను మరిచిపోలేదు. చేతనైనంత సామాజిక సేవ చేస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా పేద పిల్లలు చదువుకుంటే ఒక తరం బాగుపడుతుందనే దార్శనికుడు ఆయన. అందుకే ఆయన తన చుట్టూ ఉన్న వాళ్లతో ఎప్పుడూ చెప్పే మాట “చదువుతోనే మన బతుకుల్లో వెలుగులు నిండుతాయి” అని. భరత్ భూషణ్ ఒక్కడే కాదు, ఆయన కుటుంబంలోనే ఇలాంటి ఆదర్శప్రాయులు ఉన్నారు. ఆయన తండ్రి అప్పికట్ల జోసెఫ్ ఎమ్మెల్యేగా సేవలు అందించారు. అట్లా ఒక ప్రజాప్రతినిధి వారసుడిగా భరత్ భూషణ్ ఈ సమాజంలోకి వచ్చారు. మొదట ఐఏఎస్ సాధించి ఈ సమాజానికి సేవ చేయాలనుకున్నారు. అది కాకుండా ఐఆర్‌టీఎస్ వచ్చింది. ఒకవైపు ఉత్తమ ఆఫీసర్‌గా తన విధులు నిర్వహిస్తూనే మరోవైపు తన జాతి అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది యువత ఆర్థిక ఇబ్బందుల వల్ల డ్రాపవుట్స్‌గా మిగిలిపోతుంటారు. అలాంటి వారి పట్ల ఆపద్బాంధవుడిగా మారాడు భరత్ భూషణ్. అంబేద్కర్ చెప్పినట్టు తనను అందించిన సమాజానికి ‘పే బ్యాక్’ చేయాలనే సంకల్పాన్ని నరనరాన నింపుకున్నాడు. అందుకే తన జీతం డబ్బుల నుండి కొంత పేద విద్యార్థుల చదువుల కోసం కేటాయించాడు. అలా ఒకరిద్దరికి కాదు, వందల సంఖ్యలో పేద విద్యార్థులను చదివించి ప్రయోజకులను చేశాడు. ఇది అక్షరాల నిజం. 1344 మంది కేవలం ఈ ఒక్క విద్యాప్రదాత వల్లే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అది కూడా చిన్నాచితక కాదు. అందులో ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్1, గ్రూప్2 వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించినవారు కూడా ఉన్నారు. అట్లా ఒక తరాన్ని ఒకడుగు ముందుకు వేయించిన మహా మనీషి భరత్ భూషణ్. బహుజన మహనీయుల గురించి చాలామంది వేదికలెక్కి ఉపన్యాసాలు ఇస్తారు. కానీ, వారి ఆశయాలను నిజం చేసేవాళ్లు కొందరే. ఆ కొందరిలో ముందు వరసలో నిలిచే పేరు భరత్ భూషణ్. ఆయన ఒక్కడే ఒక ఉద్యమం. అతడే ఒక సైన్యం. ఆయన మాత్రమే కాకుండా ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన దళిత ఆఫీసర్లను కూడగట్టాడు. తన దారిలో పయనింపజేశాడు. మనం నడిచి వచ్చిన దారిలో మరికొందరికి చేయూతను ఇవ్వాలని దిశానిర్దేశం చేశాడు. ఫలితంగా అనేకమంది ముందుకు వచ్చారు. ఇట్లా ఒక విద్య విప్లవాన్ని సుసాధ్యం చేసిన ఘనుడు భరత్ భూషణ్. ఎవ్వరైనా తమ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. తమ పుట్టుకకు ఒక అర్థాన్ని వెతుక్కోవాలి. అలా ఈ విద్యాప్రదాత చేసిన విలువైన సేవలకు ఒక పద్మశ్రీ ఇచ్చినా తక్కువే. వేలాది కుటుంబాల గుండెల్లో ఆయన అందించిన స్ఫూర్తి సజీవంగా ఉంది. తనలో ఉన్న ఈ సేవాతత్పరత వల్ల ఆయనను అందరు ‘బహుజనుల బిగ్ బ్రదర్’ (బిగ్ బి)గా పిలుస్తుంటారు. బహుశా అంబేద్కర్ బ్రతికి ఉంటే భరత్ భూషణ్ వంటి నాయకుణ్ణి చూసి మురిసిపోయేవాడు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుజనుల విద్యా ప్రదాతగా మన మధ్యలోనే చాలా నిరాడంబరంగా నిలబడ్డ నిలువెత్తు శిఖరం భరత్ భూషణ్.



## ఆస్కార్ స్థాయి నటుడు జగన్

ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. ప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎ÷–లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

## తవ్వుకో.. పంచుకో! ..



**ఫిర్యాదు చేసినా..** గత రెండు రోజులుగా ఆయా గ్రామాలలో లో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి అధికారులు వ్యవహ రిస్తున్నారని విమర్శిస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టిం చుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని, అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

. జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్ కుటుంబానికి ఉన్న క్రూరత్వం, అరాచకాల చరిత్ర ప్రస్తుత తరానికి పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆనాడు అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన మాటల అసలు సందర్భాన్ని వివరిస్తూ.. తిరుమల వేంకటేశ్వర స్వామికి ఎవరైనా కీడు తలపెడితే వారికి ఎప్పటికీ మంచి జరగదు అని మాత్రమే చంద్రబాబు అన్నారని గుర్తు చేశారు. ఆ మాటలను జగన్ ఇవాళ తన స్వార్థం కోసం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' సంస్థ పాత్ర ఉందంటూ నానా హంగామా చేసి.. ఇప్పుడు చంద్రబాబును లాగడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి వక్రీకరణలు మానుకోవాలని హితవు పలికారు. జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో, ఆ హత్య వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని అచ్చెన్నాయుడు అన్నారు. మొదట గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసి, ఆపై గొడ్డలితో నరికి చంపిన చరిత్ర వారిదేనని, అందుకే వైసీపీని తాము 'గొడ్డలి పార్టీ' అని పిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారో జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. వివేకానంద కూతురు సునీతను అడిగితే నిజాలు చెబుతుందన్నారు. హత్యారాజకీయాల్లో ఆరితేరిన జగన్ వైఎస్ మరణంలోనూ పాత్ర ఉందని ఆనాడు లోకం కోడై కూసిందన్నారు.

## 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు. విత్తనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ఏపీలోని కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో, చేపట్టాల్సిన సన్నద్ధత చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హీట్‌వేవ్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట్ల టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటి ద్వారా ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల తీవ్రత అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించే విషయాన్ని పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎండల తీవ్రత, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయితీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ముసుగులు తొలగిన మతతత్వం!

‘వారు నాకు ఓటు వేయలేదు. వారి బాగోగులకు నేను బాధ్యత వహించను’ పశ్చిమ బెంగాల్ శాసనసభకు కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే రితేశ్ తివారీ అన్న మాటలవి. ఈ ఉద్ఘాటన మానవ ధర్మ ప్రేరితమేనా? ఒక్క క్షణం ఆలోచించండి. ఆ మాటల్లోని అనైతికత, దుర్మార్గం అర్థమవుతుంది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధి అలా మాట్లాడవచ్చునా? పరిపాలన, పౌరసత్వ హక్కులు ఇప్పుడు మతపరమైన ఓటింగ్ సరళిపై ఆధారపడి ఉన్నాయని ఆ ప్రజాప్రతినిధి ప్రభావశీలంగా సూచించడమే కాదూ ఆ ప్రకటన? ముస్లింలు తనకు ఓటు వేయనప్పుడు తాను ప్రాతినిధ్యం వహించేందుకు వారు సరైన అర్హులు కారని ఆ బెంగాలీ ఎమ్మెల్యే ఆ మాటలతో చెప్పకనే చెప్పాడు.రవీంద్రుడి ఆత్మ క్షోభించి ఉంటుంది. విశాల భారతావని ఆ మహాకవిని మరచిపోనట్లయితే కొత్త ‘ప్రజాప్రతినిధి’ కుత్సిత పలుకులకు భగ్గుమనేది కాదూ? అలా జరగలేదు! ఇదే, బహుశా, ఈ బెంగాల్ ముచ్చటలోని అత్యంత ఆందోళనకరమైన విషయం. వర్తమాన భారతదేశంలో నేడు మనం కంటున్నవీ వింటున్నవీ కేవలం మతతత్వ రాజకీయాలు కావు. అవి ఇంతకు ముందు కూడా ఉన్నాయి. ఇప్పుడు మనం చూస్తోంది మతతత్వ రాజకీయాల సర్వవ్యాపకత్వం. అవును, అవి సర్వసాధారణమైపోయాయి. ఆ బెంగాలీ అన్న మాటలను గతంలో ఎవరైనా వదరి ఉంటే వారి రాజకీయ జీవితాలకు అవి భరతవాక్యాలు అయివుండేవి. అయితే ఇప్పుడు అవి కేవలం ఎన్నికల ప్రలాపమని, పట్టించుకోవల్సినంత ముఖ్యమైనవి ఏ మాత్రం కావని కొట్టివేస్తున్నారు!మత ప్రాతిపదికన ప్రజలను సమీకరించేందుకు రాజకీయులు ఇంకెంత మాత్రం సంకోచించడం లేదు. గతంలో గోప్యంగా చేసిన ఆ పనిని ఇప్పుడు బాహాటంగా అడ్డూ అదుపులేని రీతిలో నిస్సంకోచంగా చేస్తున్నారు. అందుకే కాబోలు భారత జాతీయ కాంగ్రెస్‌ను ‘కొత్త ముస్లిం లీగ్’ అని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అభివర్ణించారు. రిజిజు వ్యాఖ్య వెనుక ఉన్న వాదన ఏమిటో నిశితంగా చూద్దాం. అసోం, బెంగాల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ దాదాపుగా ముస్లిం అభ్యర్థులే అయినందున కాంగ్రెస్ ఒక మతతత్వ పార్టీగా పరిణమించింది. అవును, అసోంలో ఎన్నికైన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 18 మంది ముస్లింలే. అలాగే బెంగాల్‌లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ఇరువురూ ముస్లింలే. సరే, కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎన్నికల్లో జయాపజయాలను ప్రభావశీలంగా నిర్ణయించే రాజకీయ శక్తి. అయితే కాంగ్రెస్‌ను మతతత్వ పార్టీగా నిందిస్తున్నవారు ఒక వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 650 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో అత్యధికులు ముస్లిమేతరులే. అయినప్పుడు కాంగ్రెస్ మతతత్వ పార్టీ ఎలా అయింది?ఆ ప్రశ్నకు సమాధానం అంక గణితంలో కాకుండా రాజకీయ సందేశం ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు చేసే ప్రసంగాలు, ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారం లో ఉన్నది. ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యాన్ని అనుమానాస్పదం చేయడమే అసలు లక్ష్యం. ప్రధానస్రవంతి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులుగా ముస్లిం అభ్యర్థులు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైనప్పుడు సదరు పార్టీపై మతతత్వ పార్టీ అనే ముద్ర వేయడమే అటువంటి వ్యాఖ్యలు చేసేవారి అభీష్టం. మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని చట్టవిరుద్ధం చేయడం, మెజారిటీ వర్గ ఆధిపత్యాన్ని జాతీయ వాదంగా చూపడమే రిజిజు వ్యాఖ్య పరమార్థం. ఈ రాజకీయ విలోమం చాలా చాలా ప్రమాదకరమైనది. బెంగాల్‌లో సువేందు అధికారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన హిందువులకు బీజేపీకి ఓటువేయమని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. గెలిచిన తరువాత వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఏ ప్రతిపక్ష నాయకుడు అయినా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ముస్లిం ఓటర్లకు తమ పార్టీకి ఓటువేయమని విజ్ఞప్తి చేసి ఉంటే ఏమయివుండేది?లౌకికవాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులపైనే ఎందుకు మోపుతున్నారని పలువురు తరచు ప్రశ్నిస్తున్నారు. ముస్లిం ఓటర్లు ప్రధానంగా ముస్లిం అభ్యర్థులకే ఎందుకు ఓటు వేస్తున్నారు? ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి హిందూ అభ్యర్థి విజయం సాధించగలడా? ఇవి న్యాయబద్ధమైన ప్రశ్నలే. వీటికి సమాధానం ఒక రాజకీయ వాస్తవాన్ని గుర్తించడంలో ఉన్నది: భారత జనాభాలో హిందువులు 80శాతంగా ఉన్నారు. పరిపూర్ణ భద్రతా భావంతో నిండు ఆత్మ విశ్వాసంతో ఉన్న మెజారిటీ హిందువులు మాత్రమే దేశం మెజారిటేరియన్ జాతీయవాదంలోకి జారిపోకుండా నివారించగలరు. సరే, లౌకికవాదం బలహీనపడడం బీజేపీతో మాత్రమే ఆరంభమయిందా? అలా భావించడం, ఆ సంక్షోభానికి ఆ పార్టీనే తప్పుపట్టడమంటే ఆత్మ వంచన చేసుకోవడమే అవుతుంది. లౌకికవాద పార్టీలుగా పరిగణన పొందుతున్న రాజకీయ పక్షాలు రెండు చారిత్రక తప్పిదాలకు పాల్పడ్డాయి. ముస్లింల సామాజిక పురోగతి, ఆర్థికాభ్యుదయానికి చిత్తశుద్ధితో కృషి చేయకుండా వారిని తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఓటు బ్యాంకుగా చూడడం మొదటి చారిత్రక నేరం. మితవాద ముస్లిం మతాచార్యుల ఒత్తిడికి లొంగిపోయి షాబానో కేసు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడమైనా, లేదా ప్రాంతీయ పార్టీలు తమ ప్రతీకాత్మక రాజకీయాల ద్వారా ముస్లింల అభద్రతా భావాన్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమైనా ముస్లింలకు తరచు పంపుతున్న సందేశం: మాకు ఓటు వేయండి. మిమ్ములను హిందూ మితవాదుల నుంచి సంరక్షిస్తాం. సంరక్షణ రాజకీయంగా మారింది. అయితే సాధికారత అరుదుగా లభించింది. లౌకికవాద పార్టీలు పాల్పడిన రెండో చారిత్రక తప్పిదం కూడా మొదటిదాని వలే లౌకికవాద విలువలకు తీవ్ర నష్టం చేసింది. హిందూ ఓట్లను బీజేపీకి కోల్పోతామనే భయంలో లౌకికవాదాన్ని దృఢవిశ్వాసంతో పరిరక్షించడానికి బదులుగా మృదు హిందుత్వను పాటించడంలో ఉత్సాహం చూపాయి. తద్వారా బీజేపీని సమర్థంగా ఎదుర్కోగలమని విశ్వసించాయి. 1980ల్లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం బాబ్రీమసీదుకు దశాబ్దాలుగా వేసి ఉన్న తాళాలను తెరవడాన్ని గుర్తు చేసుకోండి. అలాగే 2017లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ సందర్శించని హిందూ దేవాలయం ఏదైనా ఉన్నదా? లౌకికవాద పార్టీలు ఎప్పుడైతే మృదు హిందూత్వను పాటించడంలో నిమగ్నమయ్యాయో అప్పుడే మతవాద భావజాలానికి రాజకీయ ఆమోదం లభించేందుకు అనుద్దేశపూర్వకంగా తోడ్పడ్డాయి. దీనికి తోడుగా అస్తిత్వ రాజకీయాలు ప్రబలమయ్యాయి. ముస్లింలకు మరింత అధికంగా రాజకీయ ప్రాతినిధ్యం, వారు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు మొదలైన అంశాల ప్రాతిపదికన అసదుద్దీన్ ఓవైసీ తదితర ముస్లిం నాయకులు అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశారు. మృదు హిందుత్వ, అస్తిత్వ రాజకీయాలు ఒక విషవలయమై మున్నెన్నడూ లేని ప్రమాదకర పరిస్థితికి దారితీశాయి. హిందూ మెజారిటీవాద రాజకీయ ప్రలాపాలు ముస్లింలలో అభద్రతా భావాన్ని పెంపొందించాయి. ఈ అభద్రత ముస్లిం అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశాయి. తీవ్రవాద ముస్లిం రాజకీయాలు హిందువుల్లో భయాందోళనలు సృష్టించి మితవాద, మతవాద భావజాలాలవైపు మొగ్గేలా చేశాయి.

ఇదిలా వుండగా రాజ్యాంగ బద్ధ పాలన కుంచించుకుపోవడం అంటే రాజ్యాంగ సంస్థలు బలహీనపడడం, సమాఖ్య పాలనా పద్ధతులు క్షీణించడం, ప్రజాస్వామ్య నియమాల ఉల్లంఘన ఆరంభమయింది. రాజకీయ ఆమోదయోగ్యతను మతపరమైన గుర్తింపు నిర్ణయించడమే ఆ విపత్కర మార్పుకొక నిదర్శనం. దశాబ్దాల క్రితం ఎ.ఆర్. అంతూలే మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. హిందూ ఓటర్లు అత్యధికంగా ఉన్న కాన్పూర్ నుంచి 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా అరిఫ్ మహమ్మద్ ఖాన్ గెలుపొందారు. ఇప్పుడు అటువంటి విజయాలను ఊహించగలమా? 20 కోట్ల

# సమిష్టి కృషితోనే దోమల నియంత్రణ

### జిల్లా మలేరియా: అధికారి -చంద్ర శేఖర రావు:

**శిరివెళ్ల :- (నంది పత్రిక)**22వ తేదీ శుక్రవారం నాడు స్థానిక ఆసుపత్రి పరిధిలోని మూడవ సచివాలయం లో నిర్వహిస్తున్న ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి మరియు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర రావు పరిశీలించారు .ఈ సందర్భంగా డిఎంఓ చంద్రశేఖర రావు మాట్లాడుతూ దోమల ఉత్పత్తిని అరికట్టడం ద్వారానే కీటక జనిత వ్యాధులను పూర్తిగా నిర్మూలించ గలమని తెలిపారు. ఫ్రైడే ఫ్రైడే (ప్రతి శుక్రవారం)వారానికి ఒకరోజు ఇంట్లో మరియు ఇంటి పరిసరాలలో నీటినిలువలను తొలగించి శుభ్రం చేసి ఎండబెట్ట లన్నారు తాగునీటి మరియు వాడుక నీటి పాత్రలపై ట్యాంకులపై మూతలు తప్పనిసరి అని తెలిపారు పరిసరాల శుభ్రత నీటి నిలువలపై దోమలు లార్వాలను నశింపజేసే మందులను చల్లించాలన్నారు ఏ జ్వరమైన ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స తీర్చుకోవాలని అన్నారు మనదేశంలో మూడువేల పైగా దోమలు ఉన్న ముఖ్యంగా మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా ఫైలేరియా మెదడు వాపు వ్యాధి ఐదు రకాల దోమలు సర్వ సాధారణంగా కనిపిస్తాయన్నారు అనంతరము సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు చికిత్స కంటే ముందు జాగ్రత్త ఎంతో ఉత్తమ మన్నారు వీటి నిర్మూలన కేవలం ప్రభుత్వం లేదా అధికారుల చర్యల వల్లే సాధ్యం కాదని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇళ్ళను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీటి నిలువలను లేకుండా చేసుకుని దోమల వ్యాప్తిని అరికట్ట కలిగినప్పుడే కీటక జనత వ్యాధుల రహిత సమాజాన్ని నిర్మించ గలమని అన్నారు 2030 నాటికి కీటక జనిత రహిత సమాజంగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యానికి అందరిదీ సమిష్టి బాధ్యత అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు మరియు మలేరియా డెంగు సహాయకుడు కిరణ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# 'ఇస్కఫ్' జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి.



**నంద్యాల ప్రతినిధి. మే 22 . (నంది పత్రిక ):**భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) నంద్యాల జిల్లా ప్రథమ మహాసభను ఈనెల 24 (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్మాణ బాధ్యులు పి. మురళీధర్. ఎస్ రియాజ్ లు వెల్లడించారు.నంద్యాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు ఇస్కఫ్ నంద్యాల జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగా శ్రీధర్ రావు, గౌరవ అతిథులుగా సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి.వి. శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి కె. వసంత బాబులు హాజరవుతారని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1941లో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయ నాయకుల ఆధ్వర్యంలో 'ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్' పేరుతో ప్రారంభమైన ఈ సంస్థకు 84 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న యుద్ధోన్మాదం, ఉగ్రవాదం, పర్యావరణ కాలుష్యం, మానవ హక్కుల ఉల్లంఘన, క్షీణిస్తున్న సాంస్కృతిక విలువలపై ప్రజలను చైతన్య పరచడమే ఇస్కఫ్ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి, స్నేహభావం కోసం పనిచేస్తున్న ఈ సంస్థ జిల్లా ప్రథమ మహాసభ ద్వారా ప్రస్తుత సామాజిక సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. ఈ మహాసభను విజయవంతం చేయడానికి నంద్యాల జిల్లాలోని మేధావులు, విద్యావంతులు, యువత, విద్యార్థులు, ప్రజానీకం అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

# సైబర్ నేరగాళ్ల వలలో శిరివెళ్ల

### అప్రమత్తం చేస్తున్న పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్న బ్యాంకు మేనేజర్లు.

**శిరివెళ్ల మే 22(నంది పత్రిక)** సైబర్ నేరగాళ్లు రకరకాల కుయుక్తులతో కుట్రలతో టెక్నాలజీని అడ్డుపెట్టుకొని ఇతరుల బ్యాంకు ఖాతాల నుండి నగదును సులువుగా ఈజీగా తమ ఖాతాలకు జమ చేసుకుంటున్న సంఘటనలు ఆయా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ల నిర్లక్ష్యాన్ని అలసత్వాన్ని వేలెత్తి చూపుతున్నాయి. బ్యాంకుల్లో నగదు దాచుకున్న లావాదేవీలు జరుపుకున్న సేఫ్టీ ఉన్నట్లా లేనట్లా అని పలువురు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారులు బ్యాంకు కి వెళితే సవాలక్ష డాక్యుమెంట్లు కావాలంటూ పాన్ కార్డు ఆధార్ కార్డు పాస్ బుక్ తంబు ఐరిస్ వంటి ఆధారాలు కావాలని బ్యాంకు ఖాతాదారునికి చెబుతూ లావాదేవీలలో ముప్పు తిప్పలు పెడుతున్న బ్యాంక్ మేనేజర్లు ఈ సైబర్ నేరగాళ్లకు సులువుగా ఎలా నగదు దారా దత్తం చేస్తున్నారని పలువురు ఘాటుగా విమర్శిస్తున్నారు. సిరివెళ్ల మండల కేంద్రంలోని బీజాబీర్ అను



యువకుడు తను ఫోన్ పే నుండి ఇతరులకు పంపకుండానే నేరుగా తన ఖాతా నుండి నగదు డెబిట్ అయినట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సిరివెళ్ల యూనియన్ బ్యాంక్ నుండి తమ నగదు సుమారు 1 లక్ష 5 వేలు పైగా సైబర్ నేరగాళ్లు దోచేశారని ఆవేదన వ్యక్తం చేశారు సదరు విషయమై యూనియన్ బ్యాంక్ వద్దకు మేనేజర్ వద్దకు వెళ్లగా మేనేజర్ దురుసుగా అలసత్వంగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వెళ్లి కంప్లైంట్ ఇచ్చుకపో ఇక్కడ నీకు సంబంధం లేదు. ఫోన్ పే వాడవద్దు అంటూ సమాధానం చెప్పినట్లు వాపోయాడు ఫోన్ పే వాడుతున్నప్పటికీ బ్యాంకు నుండి నగదు ఎలా జమ అయ్యింది ఎక్కడికి వెళ్ళింది ఏ ఖాతాలో ఉన్నది అని అడిగితే సదరు బ్రాంచ్ మేనేజర్ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారని అన్నారు తమ ఖాతా నుండి నగదు డెబిట్ క్రెడిట్ కాకుండా హోల్డ్ లో పెట్టాల్సిన బ్యాంకు మేనేజర్ అలసత్వపు సమాధానంతో నష్టపోయిన ఖాతాదారునికి మరింత నష్టపోయే విధంగా సమాధానం చెబుతున్నారని అన్నారు

సదరు సైబర్ క్రైమ్ నేరగాళ్లకు చిక్కినటువంటి జాబి సిరివెళ్ల పోలీస్ స్టేషన్లో సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ తాను ట్రాక్టర్ ద్వారా వ్యవసాయం చేస్తున్నానని ఒక రైతు కష్టార్జితాన్ని ఒక బ్రాంచ్ నుండి మరొక ఖాతాకు బదిలీ అవుతుంటే బ్రాంచి మేనేజర్ ఏం చేస్తున్నారని బ్రాంచ్లో సెక్యూరిటీ లేదా అని ప్రశ్నించారు ప్రస్తుతం సిరివెళ్ల మండల వ్యాప్తంగా ఏపీకే ఆప్ లో సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయని వాటిపై క్లిక్ చేసి ఆర్థిక నష్టాలు చెవి చూడరాదని జావిద్ మండల ప్రజలకు తెలియజేశారు సైబర్ నేరగాళ్లు దోచేసిన సొమ్మును రికవరీ చేసి న్యాయం చేయాలని అధికారులను జావిద్ కోరారు.

# జొన్నరైతు సమస్యలు జాయింట్ కలెక్టర్ దృష్టికి.

### జొన్నలు ఆలస్యం చేయకుండా కొనుగోలుచేయాలి.

### మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి.



**నంద్యాల సిటీ బ్యూరో మే 22 ( నంది పత్రిక )** నంద్యాల పార్లమెంట్ లోని జొన్న రైతుల సమస్యలు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ దృష్టికి మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి తీసుకొని వెళ్ళారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ నీ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జొన్న రైతులు పడుతున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు.పార్లమెంటు పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జొన్న రైతులు వేర్ హౌస్ గోడౌన్ వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు.గత మూడు రోజులుగా రైతులు వస్తున్నా రైతులకు సంబంధించిన జొన్నలు త్వరితగతిన అన్లోడ్ కావడంలేదని అన్నారు.ప్రభుత్వం రైతులు పండించిన జొన్నలు అన్ని కొనుగోలు చేసేవిధంగా చేయాలన్నారు.అధికారులు రైతులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని కోరారు. రైతులకు సంబంధించిన జొన్నలు 10 వేల టన్నులు ప్రభుత్వ అనుమతితో కొనుగోలు చేయాలని విగ్నేప్తి చేశారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణాపురంకు చెందిన సీనియర్ రైతు నాయకులు బాలిశ్వర రెడ్డి,నంద్యాల కు చెందిన రామ కృష్ణా రెడ్డి,పాణ్యం కు చెందిన మురళీధర్ రెడ్డి,గడివేములకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి ,ఇతర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



# పరిహారం కోసం అన్నదాతల ఎదురుచూపులు





**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 22:** మంతా తుఫాను ప్రభావం కారణంగా ఆర్థికంగా నష్టపోయిన అన్నదాతలు పంట నష్టపరిహారం కొరకు ఎదురుచూపులు చూస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నెలలో బంగాళాఖాతంలో ఏర్పడి తీవ్రమైన తుఫానుగా మారి రైతుల గుండెల్లో అలజడులు సృష్టించింది. వరి పంట పొట్ట కొచ్చే దశలో తుఫాను సృష్టించిన ప్రభావం రైతులను కోలుకోని విధంగా దెబ్బతీసింది. నంద్యాల జిల్లాలో వేలాది ఎకరాల వరి పంటలు నీట మునిగిపోయి రైతులను కోలుకొని విధంగా దెబ్బతీసింది. నంద్యాల జిల్లాలో అన్ని మండలాల్లో కంటే బండి ఆత్మకూరు మండలంలోని 1847.15 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. ప్రత్యేకించి బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారాయణపురం గ్రామానికి సమీపంలో ఉన్న మంగళేటి కాలువ, తుమ్మలచెరువు లలో నీరు పొంగి ప్రవహించి పంట నష్టంతోపాటు రెండు గ్రామాల ప్రజల జీవితాన్ని అతలాకుతలం చేసింది. నీట మునిగిన పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అష్ట కష్టాలు పడాల్సి వచ్చింది. రైతులు అపార నష్టాన్ని చవిచూడాల్సి రావడంతో జిల్లా యంత్రాంగం మొత్తం ఈ రెండు గ్రామాలపైనే దృష్టి సారించి రైతన్నలకు అండదండలుగా మేమున్నామంటూ భరోసా కల్పించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అప్పట్లో రెండు గ్రామాలను సందర్శించి బాధిత రైతాంగాన్ని ఓదార్చారు. ప్రభుత్వం నుండి రైతులకు ఆర్థిక సహాయం అందజేయడంలో కృషి చేస్తానని ప్రకటించడం జరిగింది. మంతా తుఫాను ప్రభావం కారణంగా రాష్ట్రంలో 5260 కోట్ల నష్టం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అంచనాలు తయారు చేశారు. నవంబరు నెల నాలుగవ తేదీన వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలను సందర్శించి రైతులకు జరిగిన పంట నష్టం పై నివేదికలు తయారు చేశారు. ఆత్మకూరులో 1405.46 హెక్టార్ల లోను, సం జామలలో 373.46 హెక్టార్ల లోను, నంద్యాలలో 596.33, రుద్రవరంలో 10 37.69, పాణ్యం లో 239.02, కొలిమి గుండ్లలో 6.5 ఒకటి, ఉయ్యాలవాడలో 289.56, బండి ఆత్మకూరులో 1847.15, కోవెలకుంట్లలో 674.16, జూపాడు బంగ్లాలో 232.62, దొర్నిపాడు లో 17.92, నందికొట్కూరులో 102.96, మహానందిలో 606.9 8, పాములపాడు లో 713.03, వెలుగోడు లో 198.42, బనగానపల్లెలో 67.35, చాగలమర్రిలో 1374.50, గడివేములలో 211.12, కొత్తపల్లిలో 963.27, ఆళ్లగడ్డలో 170.50, అవుకులో 4.31, గోస్పాడు మండలంలో 258.02 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనాలు తయారు చేశారు. ఈ లెక్కన నంద్యాల జిల్లాలో 11,390. 34 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగింది. నివేదికలు పంపి 7 నెలల కాలం సమీపిస్తున్నప్పటికీ, పంట నష్టపరిహారం అందజేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికైనా పంట నష్టపరిహారం అందజేస్తే, రైతన్నలను ఆదుకున్నట్లుగా ఉంటుందని అన్నదాతలు భావిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై చొరవ తీసుకొని రైతులకు పంట నష్టం పరిహారం అందజేయడంలో కృషి చేయాలని జిల్లా రైతాంగం కోరుకుంటూ ఉంది.

# తెలంగాణరాష్ట్రకుమ్మరఆత్మగౌరవభవన్ నిర్మాణ నిధుల మంజూరు చేయండి

**హైదరాబాద్. మే 22 . (నంది పత్రిక ):**కుమ్మర్ల సామాజిక ఆర్థిక విద్యా సాంస్కృతిక వికాసానికి యువత మహిళల ఉపాధి సాంకేతిక శిక్షణ వృత్తి నైపుణ్యానికి కేంద్రంగా విలసిల్లే తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మ గౌరవభవన్ నిర్మాణానికి బడ్జెట్ నిధుల కేటాయింపుకు నిధుల మంజూరి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి తెలంగాణ బీ 'సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు.తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించనున్నట్లు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.హైదరాబాద్ లోని సంక్షేమ భవన్ (మాసబ్ ట్యాంక్)లో బీసీ ఫైనాన్సు కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ అధ్యక్షులు నేదునూరి కనకయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్ కుమార్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కాకులారం కృష్ణ తో కూడిన ప్రతినిధుల బృందం బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి కాంత్ గౌడ్ కి ఆత్మ గౌరవభవన్ నిర్మాణానికి నిధుల మంజూరి కి వినతిపత్రం సమర్పించారు.



## భారత్‌లోని 'స్నేక్ హాట్‌స్పాట్స్'.. ఈ రాష్ట్రాలకు వెళుతున్నారా? జాగ్రత్త!

భారతదేశం వన్యప్రాణి వైవిధ్యానికి ప్రసిద్ధి. ముఖ్యంగా దేశంలో 300కు పైగా పాము జాతులు ఉన్నాయి. అధికారికంగా ఏ రాష్ట్రంలో పాములు ఎక్కువగా ఉన్నాయనే జాబితా లేనప్పటికీ, జీవవైవిధ్య అధ్యయనాల ప్రకారం కొన్ని రాష్ట్రాలు 'స్నేక్ హాట్‌స్పాట్స్'గా మారాయి. వన్యప్రాణి ప్రేమికులు, పర్యాటకులు ఈ ప్రాంతాలకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పశ్చిమ కనుమలు విస్తరించి ఉన్న కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో పాముల సాంద్రత చాలా ఎక్కువ. ముఖ్యంగా కేరళను 'భారతదేశ పాముల వైవిధ్య రాజధాని'గా పిలుస్తారు. ఇక్కడ కింగ్ కోబ్రా, మలబార్ పిట్ వైపర్ వంటి అరుదైన జాతులు కనిపిస్తాయి. కర్ణాటకలోని అగుంబే ప్రాంతం "కోబ్రా రాజధాని"గా పేరుగాంచింది. మహారాష్ట్రలోని ముంబై, పూణే వంటి నగరాల్లోనూ వర్షాకాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తాయి. పశ్చిమ బెంగాల్‌లోని సుందర్బన్స్, అస్సాంలోని కజీరంగా, ఒడిశాలోని సిమ్లిపాల్, ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ పరిసర ప్రాంతాలు కూడా పాములకు నిలయాలు. ఈ ప్రాంతాల్లో కింగ్ కోబ్రా, రస్సెల్స్ వైపర్ (రక్తపింజరి), కట్లపాము (క్రైట్) వంటి విషపూరిత సర్పాలు

# లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.

**ఎన్ టి ఏ ను రద్దుచేసి రాష్ట్రాలకే వైద్య విద్య ప్రవేశాలను నిర్వహించుకునే అధికారాన్ని పునరుద్ధరించాలి.**

**రాయలసీమ విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద ధర్నా**

**కె.భాస్కర్, పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు**




**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ, చీూా ను రద్దుచేసి, రాష్ట్రాలకే వైద్య విద్య ప్రవేశాలను నిర్వహించుకునే అధికారాన్ని పునరుద్ధరించాలనీ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ డిమాండ్ చేశారు. కర్నూలు నగరం రాయలసీమ విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్ పరీక్ష మరోసారి ప్రశ్నాపత్రం లీక్, అవకతవకల కారణంగా వివాదంలో నిలిచి పరీక్ష రద్దు వరకు పరిస్థితి వెళ్లడం కేంద్ర ప్రభుత్వం మరియు ఎం టి ఏ వైఫల్యానికి నిదర్శనంనీ అని అన్నారు. ఇప్పటికే 2024లో కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీశాయి. 2024లో బీహార్ సహా పలు రాష్ట్రాల్లో ప్రశ్నాపత్రం లీక్ ముఠాలు బయటపడగా, అరెస్టులు జరిగాయి. "గ్రేస్ మార్కులు", అవకతవకలు, చీటింగ్ ఆరోపణలతో లక్షలాది మంది విద్యార్థులు పరీక్ష మళ్లీ నిర్వహించాలని ఉద్యమించారు. అప్పట్లో కూడా పరీక్షా వ్యవస్థపై నమ్మకం దెబ్బతిన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సమస్యలను మూలాల నుండి పరిష్కరించలేదు. ఇప్పుడు ఈ నెల 3న మళ్లీ ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్ర లో పేపర్ లీకేజీ గుర్తై అది వివిధ రాష్ట్రాలకు ముందుగానే పేపర్ షేర్ చేయబడింది. దాదాపు 25 లక్షల మంది విద్యార్థులు నీట్ యూజీ పరీక్షలు రాశారు. వీరందరూ తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. లక్షల రూపాయలను వెచ్చించి కోచింగ్ లు తీసుకుని పరీక్షలు రాస్తే కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో అది రద్దయిపోయింది. విద్యార్థులకు భరోసా ఇవ్వవలసిన ఎన్ టి ఏ పరీక్షలు మళ్ళీ నిర్వహిస్తామని విద్యార్థులు మళ్లీ పరీక్ష ఫీజులు చెల్లించ అవసరం లేదని ప్రకటించి చేతులు దులుపుతుంది. దేశంలో తరచు 86 సార్లు ప్రవేశ పరీక్షలు లీకేజీ కావడం దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష సాధ్యం కాదు అనేదానికి బలం చేకూరుస్తుంది. నీట్ పేరుత దేశంలో కోచింగ్ మాఫియా వేల కోట్ల వ్యాపారం చేస్తోంది. కోచింగ్ తీసుకోలేక గ్రామీణ, పేద, ప్రభుత్వ విద్యార్థులు వెనుకబడుతున్నారు. దీంతో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దీనికి తోడు ప్రశ్నాపత్రం లీకులు, అవినీతి పునరావృత మవుతున్నాయి. వైద్య విద్యను కార్పొరేట్ వ్యాపారంగా మార్చుతున్నారు. దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష ఆధారంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించడం అన్యాయం. రాష్ట్రాల విద్యా విధానాలు, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం నీట్ ను రుద్దడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. కావున రాష్ట్రాలకే వైద్య విద్యా ప్రవేశాల పరీక్షలను నిర్వహించుకునే అధికారాన్ని పునరుద్ధరించాలి. ప్రశ్నాపత్రం లీక్ మాఫియాను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఎం టి ఏవైఫల్యంపై న్యాయ విచారణ జరపాలి. విద్యను కార్పొరేట్ శక్తుల లాభాల కోసం కాకుండా ప్రజల హక్కుగా పరిరక్షించాలి. ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, రమేష్, విజయ్, హరి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ పై అప్రమత్తంగా ఉండాలి...

**డాక్టర్ ఏ. మౌనిక**



**జూపాడుబంగ్లా మే 22 (నంది పత్రిక)** రాష్ట్రంలో వేసవి ఉష్ణోగ్రతలు అధికముగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం పారుమంచాల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ఏ.మౌనిక సూచించారు. ముఖ్యముగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, మరియు బహిరంగ ప్రదేశంలో పని చేసే కార్మికులు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు వంటివి ద్రువపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. పుచ్చ పండ్లు, తాటి ముంజులు, నీటి శాతం ఉండే ఎక్కువగా ఉండే పండ్లు ఆహారంలో భాగంగా తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని చెప్పారు. బయటకు వెళ్ళవలసి వస్తే గొడుగు, టోపీ, లేదా తలకు టవల్ కప్పుకోవాలి. తేలికపాటు తెలుపు లేదా లేత రంగు వదులైన దుస్తులు ధరించడం మంచిదన్నారు. గట్టిగా ఉండే నలుపు రంగు దుస్తులను మాత్రం ధరించవద్దని హెచ్చరించారు. ఎండలో ఎక్కువసేపు పనిచేయడం మద్యము, కాఫీ, టీ, ఉంటే పానీయాలు అధికముగా తీసుకోవడం, నూనె ఎక్కువగా ఉన్న ఆహారము వేపుళ్ళు తినడం మంచిది కాదని స్పష్టం చేశారు. పిల్లలు, వృద్ధులను, వాహనాలలో ఒంటరిగా వదిలేయకూడదని ఎండలో ఆడుకోనివ్వరాదని సూచించారు. :- వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్స... అధిక జ్వరం, తలనొప్పి , తల తిరగడం, వాంతులు అలసట చెమట వాగిపోవడం వంటివి వడదెబ్బ లక్షణాలుగా కనిపిస్తాయన్నారు. ఇలాంటి లక్షణాలను గమనించిన వెంటనే బాధితుడిని చల్లని ప్రదేశానికి తరలించాలి, శరీరంపై చల్లటి నీరు పోయాలి. ఓ ఆర్ యఎస్ లేదా సాధారణ నీరు ఇవ్వాలని చెప్పారు. పరిస్థితి తీవ్రమైతే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి లేదా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. మండల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఓఆర్ యాస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

# ప్రపంచ ప్రీ ఎక్లాంషియా దినోత్సవం



**కల్లూరు నంది పత్రిక...** కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ బి. మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీ ఎక్లాంషియా దినోత్సవాన్ని ఏర్పాటు చేయడం జరిగినది . గర్భవతులలో వచ్చే ప్రీ ఎక్లాంషియా లక్షణాలను వివరించడం జరిగినది, గర్భవతి కాలంలో అధిక రక్తపోటు, మూత్రంలో ప్రోటీన్ పోవడం, అధిక బరువు పెరగడం, చేతులు కాళ్లలో నీరు చేర చేరడము, తలనొప్పి ,వికారం, వాంతులు, కంటి చూపులో మార్పులు, పొత్తికడుపు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని సకాలంలో వాటికి తగిన చికిత్స అందించాలని తెలియజేయడమైనది. అంతేకాకుండా కర్నూలు గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సస్ నుండి శ్రీమతి ఎం. జయలక్ష్మి ఆధ్వర్యంలో స్టేట్ మిడ్ వైఫరీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ నర్సులు సాధారణ ప్రసవం కొరకు గర్భవతులు ప్రతి త్రైమాసికములో వారు చేయవలసిన వ్యాయామముల గురించి డిమాం( స్టేషన్ చేసి చూపించడం జరిగినది. దీనివల్ల సాధారణ ప్రసవములు జరుగునని తెలియజేయడం జరిగినది .గర్భిణీ సమయంలో, ప్రసవ సమయంలో, ప్రసవం తరువాత తీసుకునవలసిన జాగ్రత్తలను గురించి తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ ఱ.రంగస్వామి, పీ.హెచ్.ఎన్ బి. నారాయణమ్మ సూపర్వైజర్లు సంపత్ కుమార్ సత్యం, స్టాఫ్ నర్స్ లు, ఎం ఎల్ హెచ్ పి లు, ఆరోగ్య కార్యకర్తలు సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం





**జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో ఉన్న జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు కలిసి సందర్శించారు. గోల్డ్ మైనింగ్ కార్యకలాపాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులు, ఖనిజ శుద్ధి ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ.... జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో అత్యాధునిక యంత్రాంగం, నూతన సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం గనుల్లో సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు వెళ్లే అవకాశముందని తెలిపారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతుండగా, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి చేస్తున్నారని వెల్లడించారు. జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు వివరించారు. ఈ గోల్డ్ మైన్ దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. త్వరలోనే అక్కడి ప్రక్రియలను పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో మైనింగ్ రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖనిజ సంపదను రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర తీరప్రాంతాల్లో లభించే రేర్ ఎర్త్ మినరల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని, చైనాకు పోటీగా నిలిచే స్థాయిలో మన దేశంలో ఖనిజ వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి అవసరమైన బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా క్వార్ట్జ్ ఖనిజానికి విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి, సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు. అలాగే రాష్ట్రంలో లభించే గ్రానైట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉందని, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అలంకార వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను ముఖ్యమంత్రి త్వరలో సందర్శించే అవకాశముందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో గత ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. భవిష్యత్తులో మైనింగ్ రంగం ద్వారా రాష్ట్రానికి మరింత ఆదాయం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ప్రాంతీయాభివృద్ధికి కొత్త దిశ యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆదాయం. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు.జొన్నగిరి గోల్డ్ మైన్ సందర్శన సందర్భంగా ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు మాట్లాడుతూ...గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రోత్సాహం, పారదర్శకత లేకపోవడం వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. అప్పటి పాలకుల వైఖరి కారణంగా సంస్థ అనేక ఇబ్బందులు ఎదుర్కొని, తటస్థ ధోరణిలో కొనసాగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోల్డ్ మైన్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని చెప్పారు. జొన్నగిరి గోల్డ్ మైన్ ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుండటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. ఇప్పటికే 300 నుండి 400 మందికి పైగా స్థానిక యువతకు, విద్యావంతులకు, కార్మికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం ఎండాకాలంలో వలసలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు గోల్డ్ మైన్ కారణంగా స్థానికంగా ఉపాధి లభిస్తూ వలసలను తగ్గించే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపులు వంటి కీలక అంశాలు అప్పటి ఉప ముఖ్యమంత్రి కే.ఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పించడంతో గోల్డ్ ప్రొడక్షన్ విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయని, దాంతో మరింత పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగాలు, ప్రాంతానికి ఆర్థికాభివృద్ధి, రాష్ట్రానికి ఆదాయం తీసుకొచ్చే ఈ ప్రాజెక్ట్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇంచార్జ్) నాగిని, డి.ఎస్.పి వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.



## కర్నూలు జనసేన నియోజకవర్గ ఇన్చార్జి చింత సురేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన దుర్గం బాలాజీ శర్మ రాష్ట్ర ప్రచార ప్రధాన కార్యదర్శి,



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలిచిందని దుర్గం బాలాజీ అన్నారు.జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ చేస్తున్నటువంటి పనులను చూసి పార్టీలో చేరి జనసేన పార్టీకి నా వంతు నేను కృషి చేస్తానని దుర్గం బాలాజీ అన్నారు

# నేడు కర్నూలు మండల సర్వసభ్య సమావేశం

**కర్నూలు ఎంపీడీవో రఘునాథ్**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** కర్నూలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 11:00 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశమందిరం నందు జరుపుటకు నిర్ణయించారు . కనుక గౌరవ జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు మరియు మండల స్థాయి అధికారులు సదరు సర్వసభ్య సమావేశం నకు ఉదయం 11:00 గంటలకు మండల పరిషత్ సమావేశభవనము నందు హాజరుకావలసిందిగా కోరడమైనది. దయచేసి పై విషయమును పత్రికల ద్వారా తెల్పవలసిందిగా కోరడమైనది.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన... ఎంపీడీవో డి. గోపికృష్ణ

**జూపాడుబంగ్లా :మే: 22: (నంది పత్రిక)** మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో డి. గోపికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి. గోపికృష్ణ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలు త్వరగా పనులకు వచ్చి రెండవ అటెండెన్స్ వరకు ఉండి వెళ్లాలని ఎంపీడీవో కూలీలకు సూచించారు. ఉపాధి పనులకు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ప్రతిరోజు ఉదయాన్నే పనులు ప్రారంభించి కొలతల ప్రకారం పూర్తి చేయాలని కూలీలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



నంది

శనివారం 23 - 05 -2026

# ఒక నెల- ఒక నియోజకవర్గం- 4 పర్యటనలు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి





## ప్రతి శుక్రవారం ఒక నెల- ఒక నియోజకవర్గం- 4 పర్యటనలు కార్యక్రమ నిర్వహణ జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ప్రతి నియోజకవర్గంలో "ఒక నెల ఒక నియోజకవర్గం 4 పర్యటనలు" కార్యక్రమాన్ని 4 సార్లు నిర్వహించి ప్రజల నుండి అర్జీలు తీసుకుని పరిష్కరించడం జరుగుతుందని, వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం "ఒక్క నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గం రెండవ సందర్శనకు సంబంధించి స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ఒక నెల ఒక నియోజకవర్గం 4 పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గంలో రెండవ విడత సందర్శన కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. మొదటి విడత సందర్శన లో స్వీకరించిన అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యలకు సంబంధించిన ఆర్డర్లు ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫైనాన్షియల్ అంశాలకు సంబంధించిన అర్జీలపై అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని, అమలు సాధ్యం కాని అర్జీలకు "నాట్ ఫీజిబుల్"గా స్పష్టమైన ఆర్డర్లు ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరిష్కరించగలిగే అర్జీలపై వెంటనే చర్యలు తీసుకుని సంబంధిత ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు.వచ్చే శుక్రవారం నిర్వహించే మూడవ విడత పర్యటనలో రెండవ విడతలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఆర్డర్లు, ఎండార్స్‌మెంట్‌లను తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలపై తీసుకున్న చర్యలు ప్రజలకు కనిపించేలా డిస్ప్లే చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న అర్జీలు, ముఖ్యంగా బ్రిడ్జిలు, రోడ్లు వంటి ఆర్థిక సంబంధిత అభ్యర్థనలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని తెలియజేస్తే, తమ పిటిషన్ పురోగతి ఏ దశలో ఉందో అర్జీదారులకు స్పష్టత వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు తీసుకున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా పారదర్శకత మరింత పెరుగుతుందన్నారు. పరిష్కరించలేని అర్జీల విషయంలో కూడా స్పష్టమైన కారణాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. "ఈ కారణాల వల్ల పని చేయలేము", "ఇది సాధ్యం కాదు" లేదా "ప్రభుత్వానికి పంపిస్తున్నాం" వంటి క్లారిటీ ఇవ్వడం ద్వారా అర్జీదారులు ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని తెలిపారు. ప్రతి అర్జీదారుకు తప్పనిసరిగా స్పష్టమైన సమాచారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.నాల్గవ విడత పర్యటనలో గత మూడు విడతలలో పరిష్కరించిన గ్రీవెన్సెస్‌ను డిస్ప్లే చేయడంతో పాటు, పరిష్కరించలేని అర్జీలకు సంబంధించిన కారణాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చిన అనంతరం, అందజేసిన కాపీకి సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్‌ను అధికారులు భద్రపరచుకోవాలని కలెక్టర్ సూచించారు..కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కృష్ణ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఐసిడిఎస్ పిడి విజయ, డిఎంహెచ్ఓ డా.కామేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డి ఆర్ డి ఏ పిడి రమణా రెడ్డి, , డ్వామా పిడి నరసింహా రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామాన్ని తనిఖీ చేసిన.. ఎంపీడీవో డి. గోపికృష్ణ



**జూపాడుబంగ్లా :మే :22: (నంది పత్రిక)** మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో స్వర్ణ గ్రామాన్ని( సచివాలయం ) అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణలో ఎటువంటి జాప్యము ఉండకూడదని ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఎంపీడీవో కార్యాలయ ప్రాంగాన్ని మరియు గ్రామ వీధులు పరిశుభ్రముగా ఉంచుకోవాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యముగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డి పద్మావతమ్మ, స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అలిపిరి పరిసరాల్లో పుట్ పాత్ లపై దుకాణాలు తొలగించండి.

## డిప్యూటీ కమిషనర్ అమరయ్య.



**తిరుపతి బ్యూరో చీఫ్ మే 22నంది పత్రిక** అలిపిరి పరిసరాల్లో భక్తులకు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా పుట్ పాత్ లపై ఉన్న దుకాణాలను తొలగించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య అధికారులు, వ్యాపారస్థులకు సూచించారు. భక్తులు, వాహన చోదకుల పిర్యాదు మేరకు ఏ ఎస్పీ రవి మనోహరాచారి, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి అలిపిరి పరిసర ప్రాంతాల్లో పుట్ పాత్ పై ఉన్న వ్యాపారస్థులతో మాట్లాడారు. పుట్ పాత్ పై వ్యాపారాలు చేయడం వలన ప్రజలతో పాటు భక్తులకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. అలాగే టిఫిన్ షాప్, దుకాణాల వ్యర్థాలు జూ పార్కు రోడ్డు పక్కనే వేయడంతో వన్యమృగాలు వస్తున్నాయని తెలిపారు. కావున ఇక్కడ ఇబ్బందికరంగా ఉన్న దుకాణాలను ఇక్కడ నుండి తొలగించాలని, లేకుంటే మేమే తొలగించడం జరిగితుందని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ వెంట డి ఎస్పీ లు కొండయ్య నాయుడు, భక్తవత్సలం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సి ఐ లు రామ కృష్ణ, రామ్ కిషోర్, ఏసీపీ పార్వతి ప్రియ, పోలీస్, హెల్త్, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఉన్నారు.



# ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వైసీపీ జీర్ణించుకోలేకపోతుంది

## అన్నా క్యాంటీన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి టి జి భరత్ గుప్తా



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వైసీపీ జీర్ణించుకోలేకపోతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. కర్నూలు సర్వజన ఆసుపత్రిలో ఉన్న అన్నా క్యాంటీన్ ను మంత్రి టీజీ భరత్ గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేస్తున్న వృద్ధులు, మహిళలతో మాట్లాడి సరిగ్గా భోజనం పెడుతున్నారా, రుచికరంగా ఉందా అని ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండని పదే పదే అడిగారు. ఆ తర్వాత అన్నా క్యాంటీన్ పరిసర ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ..ప్రజలకు భోజనం పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు ఈ ఆకస్మిక తనిఖీ చేశానని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఎంతో మంది ఇతర ప్రాంతాల నుండి వస్తుంటారని.. అన్నా క్యాంటీన్ లో పెడుతున్న భోజనం వల్ల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. "ఆహారం చాలా బాగుందని ప్రజలు చెబుతున్నారు. ఏ ఒక్కరిని అడిగినా పాజిటివ్ రెస్పాన్స్ కనిపిస్తోంది. గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్ లను మూసివేసి అరాచక పాలన సాగించింది. మా ప్రభుత్వంలో పేదల ఆకలి అన్నా క్యాంటీన్ ద్వారా తీర్చుతున్నామని టీజీ భరత్ గుప్తా చెప్పారు. ఇక ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే వైసీపీ జీర్ణించుకోలేక పోతుందన్నారు.

# ఈవీఎం గోదాముల డోర్ లాక్ సీళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, మే 22(నంది పత్రిక):-** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మాసపు తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డ్‌లో భద్రపరిచిన ఈవీఎంల గోదాములను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాముల డోర్ లాక్ సీళ్ల స్థితిని పరిశీలించిన కలెక్టర్, ఈవీఎంల భద్రతకు సంబంధించిన రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న కలెక్టర్, గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ లాగ్‌బుక్‌ను పరిశీలించి, విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ పనితీరును పరిశీలించిన కలెక్టర్, అగ్నిమాపక పరికరాల అందుబాటు మరియు వాటి పనితీరుపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. డోర్ లాక్ సీళ్ల భద్రతా అంశాలను పరిశీలిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# బేతంచెర్ల లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం.

## హాజరైన డోన్ ఎంఎల్ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి.



**బేతంచెర్ల మే 22 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణం లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నకు డోన్ ఎంఎల్ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు.బేతంచెర్ల మండల తహషిల్దార్ నాగమణి ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ బేతంచెర్ల నగర పంచాయితీ కమిషనర్ హరిప్రసాద్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కోట్ల మాట్లాడుతూ ప్రజా వేదిక కార్యక్రమంనకు వచ్చి, అర్జీలు అంద జేసిన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్డుల పునర్విభజన లో కుట్రలు అరికట్టాలి

## కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వార్డుల పునర్విభజన ప్రక్రియలో భాగంగా కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 52 వార్డులను 68 వార్డులుగా మారుస్తూ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసిందని కర్నూలు జిల్లా మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు. శుక్రవారం కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇన్చార్జి కమిషనర్ వెంకటకృష్ణను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కాలనీల పేర్లను పొందుపరచకుండా దిక్కులు ఇంటి నంబర్లతో వార్డుల పునర్విభజన చేయడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడకముందే ఉన్న కాలనీలను తుడిచిపెట్టుకొని పోయేలా కుట్రలు చేస్తున్నారని, ఎస్సీలు అధికంగా ఉన్న కాలనీలను ఒకే వార్డులో ఉంచకుండా వేరువేరు వార్డులలో మార్చడం ఎస్సీలను రాజకీయంగా అనుగదొక్కడమేనని మీసాల సుమలత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముంతాజ్, అత్తర్ బి, షబానా, జాఫర్ బి, పీటర్ రామస్వామిలు పాల్గొన్నారు.

# పండగ రోజు గోవధను నిరోధించాలి

## బీజేపీ నాయకుల వినతి పత్రం

**వెలుగోడు, మే 22 (నంది పత్రిక):** బక్రీద్ పండుగ సందర్భంగా వెలుగోడు మండలం లో గోవధను పూర్తిగా నిరోధించాలని కోరుతూ బీజేపీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. మండల బీజేపీ అధ్యక్షుడు పోతుల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ సురేష్‌లకు ఈ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో మండల పరిధిలో గోవుల అక్రమ రవాణా పెరిగే అవకాశం ఉందని పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గోవధను పూర్తిగా అరికట్టి గోవులను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.వెలుగోడు మండలంలో పండుగ వరకు గోవుల కొనుగోలు, అమ్మకాలు జరగకుండా ఆవుల మందల యజమానులకు సూచించాలని. అలాగే గోవులను అక్రమంగా తరలించే వాహనాలను తనిఖీ చేసి, గోవులను గోశాలలకు తరలించాలని.ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ గోవధ నిషేధం మరియు పశు సంరక్షణ చట్టం-1977 ప్రకారం గోవధ నేరమని, అక్రమ రవాణా, కొనుగోలు, అమ్మకాలలో పాల్గొనే వారిపై కఠిన కేసులు నమోదు చేసి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలం సుధాకర్, మహేష్, పురుషోత్తం గౌడ్, నాగేశ్వరరావు, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రామచిలుకలు ఎక్కడుంటే అక్కడ వాతావరణం బాగున్నట్టు!

ఈ మధ్య కాలంలో మీ ఇంటి దగ్గర, పార్కుల్లో, తోటల్లో ఆకుపచ్చని రామచిలుకలు ఎక్కువగా కనిపిస్తున్నాయా? అయితే అది మీ ప్రాంత పర్యావరణంలో వస్తున్న మార్పులకు ఒక శుభ సంకేతమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఈ పక్షుల ఉనికి పెరగడం వెనుక వాతావరణ మార్పు, జీవవైవిధ్యం, నివాస స్థలాల మార్పు వంటి అనేక అంశాలు దాగి ఉన్నాయి.

**పర్యావరణ సూచికలుగా చిలుకలు** శాస్త్రవేత్తలు ఈ రామచిలుకలను "పర్యావరణ సూచికలు" (జుఅజఱతీశీఅఎవఅ్‌ఖుశ్రీ ×అ౦ఱఎఛ్‌శీతీం)గా పరిగణిస్తున్నారు. అంటే, వాటి ఉనికి లేదా వాటి సంఖ్యలో పెరుగుదల, ఆ ప్రాంత పర్యావరణంలో వస్తున్న మార్పులను సూచిస్తుంది. ఉష్ణోగ్రతల్లో మార్పులు, ఆహార లభ్యత, మొక్కల సాంద్రత వంటి అంశాలు ఈ పక్షుల నివాసాన్ని ప్రభావితం చేస్తాయి. వీటి జనాభాను పర్యవేక్షించడం ద్వారా, విస్తరిస్తున్న నగరాలకు వన్యప్రాణులు ఎలా అలవాటు పడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

# హత్యా రాజకీయాలను ప్రోత్సహించింది, రాయలసీమకు ద్రోహం చేసింది జగనే

## కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత ఓటమి చెందిన వైసిపి నేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కోమా లోనుంచి 23 నెలల తర్వాత బయటకు వచ్చి రాష్ట్రంలో సుస్థిరమైన అభివృద్ధి సంక్షేమం పాలనను ప్రజలకు అందిస్తున్న నారా చంద్రబాబునాయుడు పై నిన్నటి దినం పత్రికా ప్రతినిధుల సమావేశంలో కొన్ని ఊహాజనితమైన ఆరోపణలు చేస్తూ హత్యా రాజకీయాల గురించి జగన్ నోటి వెంట వచ్చిన చిలుకపలుకులను విని రాష్ట్రంలో చిన్న పిల్లల సహితం నవ్వు కుంటున్నారని, వారి మాటలు వింటుంటే దయ్యాలు వేదాలు వల్లించున్నట్లుందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండిస్తూ ఆవహేళన చేశారు. రాష్ట్రంలో హత్యారాజకీయాలకు నిలయం ఏది అని ప్రశ్నిస్తే వైఎస్ కుటుంబమే సంబూ ముక్త కంఠంతో సమాధానం వస్తుందని, అలాంటి కుటుంబం నుంచి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి హత్యా రాజకీయాల గురించి మాట్లాడటము చూస్తే ఏమి అనాలో కూడా అర్థం కావడం లేదు. జగన్ తాత రాజా రెడ్డి తనకు సహాయం చేసిన వారిని హతమార్చి వారి ఆస్తులను స్వాధీనం చేసుకొని హత్యారాజకీయాలకు బీజం వేశాడు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనైనవై.ఎస్.బాధితులు ఉన్నారని అది విస్మరించి జగన్ మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడు ని హత్యారాజకీయాలకు ప్రోత్సహిస్తున్నారని మాట్లాడడం సిగ్గు చేటు. సొంత బాబాయ్ వై.ఎస్.వివేకానంద రెడ్డి హత్య జరిగిన సంఘటనను కూడా తన రాజకీయ స్వార్థ ప్రయోజనం కోసం వాడుకుంటూ తన పేపర్లో ఈ హత్యను నారా చంద్రబాబు నాయుడు కి ఆపాధిస్తూ నారాసుర రక్తచరిత్ర అంటూ కథనాలు ప్రచురణ చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు జగన్ మోహన్ రెడ్డి సొంత బాబాయ్ హత్యను చేసిన వారి గురించి 5 సంవత్సరాలు అధికారంలో ఉన్న జగన్ హత్యకు కారకులైన వారిని ఎందుకు అరెస్టులు చేయ కుండా ఉపేక్షించారని ప్రశ్నిస్తూ . ఈ హత్య వెనుక ఉన్న సూత్ర ధారి, పాత్రధారి జగనే కనుక కేసును నీరు కార్చే విధంగా కేసుకు సంబంధం ఉన్న వారిని ఒక్కొక్కరిని తహ మార్చిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తునే ఉన్నారు. పొరుగు జిల్లా అనంతరం జిల్లా వాసి పరిటాల రవిని హత్య గావించి తండ్రి అధి కారాన్ని అడ్డుపెట్టుకొని కేసు నుంచి బయట పడిన వాడు జగన్ కాదా అని ప్రశ్నించారు. తాను కేసు నుంచి బయటపడడమే కాక, కేసుకు సంబందించిన వారిని హతం చేయడం జగన్ పాత్ర ఉంది. అనుదినం హత్యారాజకీయాల తోనే కాలం వెళ్ళబుచ్చే జగన్ మోహన్ రెడ్డి, నీతిని, నిజాయితికి, నిబద్ధతు మారు పేరుగా ఉన్నానని, తనకు తాను డబ్బ కొట్టుకోవడం కాదని అన్నారు.రాష్ట్రంలో నీ ఆరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమికి ప్రజలు అధికారం అప్పగించగా, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అణుక్షణము ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతూ ఎక్కడ ఎలాంటి అవినీతికి తావులేకుండా స్వచ్ఛమైన పాలనను అందిస్తూ ప్రజల మద్దతును చూరకొనుచున్న చంద్రబాబు నాయుడు కి ప్రజల నుంచి లభిస్తున్న ఆధరణ చూసి జీర్ణించుకోలేని జగన్ మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడు పైన ఆసత్య ఆరోపణలు చేస్తూ తన పేటిఎం బ్యాచ్ను ఉసిగొల్పుచున్నారని, మీలాంటి వారి ఊకదంపుడు ఉపన్యాసాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరనే విషయాన్ని గుర్తించుకుంటే మంచిదన్న విషయాన్ని తెలియజేస్తున్న. మీ తండ్రి రాజశేఖర రెడ్డి మరనానంతరం ఆనాడు రిలయన్స్ వారి పాత్ర హత్య వెనుక ఉందని, రాష్ట్రంలోని రిలయన్స్ సంస్థలపైన దాడులు చేయించడమే కాక తగుల బెట్టించారు. అలాంటి మీరు అధికారంలోకి వచ్చాక రిలయన్స్ వారితో కుదుర్చుకున్న చీకటి ఒప్పందం కుదుర్చుకొని వారికి రాజ్యసభలో స్థానం కల్పించింది నీవు కాదా జగన్ ? సొంత తండ్రి మరణిస్తే దానిని కూడా పక్కన బెట్టి ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాల సేకరణ చేప ట్టిన వ్యక్తివ నీవు కాదా ? నీ నోటి వెంట హత్య రాజకీయాల మాట వింటుంటే హాస్యాస్పందంగా ఉందని అన్నారు. నీతిగా రాజకీయాలు నెరపుతున్న చంద్ర బాబు నాయుడు నీతి మంతమైన పాలనను అందిస్తున్న బాబు ఏ రోజు కూడా హత్యా రాజకీయాలను, కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సాహించ లేదని, వ్యవస్థలను వారు తన స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోలేదని, వారు నీలాగే కక్ష రాజకీయాలను అవలంబించి ఉండి ఉంటే నీవు ఈ రోజు బయట తిరిగే వాడవు కాదు, జైలులో ఉండే వాడివి జగన్ రాలయసీమ ప్రాంతానికి ద్రోహం చేసిన వారు నీవు, నీ తండ్రీ, చంద్రబాబునాయుడు రాయలసీమ వెనుకబాబు తనాన్ని ధృష్టిలో ఉంచు కొని సాగు, తాగు నీరు అందించి రాయలసీమ వెనుకబాటు తనాన్ని రూపు మాపారు. నీ పులివెందులకు కూడా నీరు అందించిన ఘనత చంద్రబాబునాయుడుదే. ఈ రోజు చంద్రబాబునాయుడు చొరవ కాలణంగానే అనంతపురం, కర్నూలు జిల్లాలలో పరిశ్రమల స్థాపనకు కృషి జరుగుతున్న విష యాన్ని గుర్తించుకొని మాట్లాడితే మీకే మంచిది జగన్. అన్నా క్యాంటీన్ల ద్వారా పేద వాడి ఆకలి తీర్చుచున్న క్యాంటీన్లను తొలగించి పేద వాడి పొట్టను కొట్టిన నీవు అన్నం పెట్టే చంద్రబాబునాయుడు ని విమర్శించే స్థాయి నీకు లేదు జగన్. మరోసారి చంద్రబాబునాయుడు పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజలు 11 నుంచి 1కి తీసుకొని వస్తారు జాగ్రత్త అని హెచ్చరించారు.

# మే 31 మహాసభను జయప్రదం చేయండి.

## రాయలసీమ సాగునీటి సాధన సమితి పిలుపు



**నంద్యాల సిటీ బ్యూరో మే 22 ( నంది పత్రిక )** ఈ నెల మే 31న నంద్యాలలో నిర్వహించనున్న 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' 10వ వార్షికోత్సవ మహాసభ విజయవంతానికై రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లె, సంతజూటూరు, బండిఆత్మకూరు గ్రామాలలో సమితి కార్యవర్గ సభ్యులు రాఘవేంద్రగౌడ్, పట్నం రాముడు గార్లు విస్తృతంగా పర్యటించారు. అక్కడి రైతాంగంతో సమావేశమై రాయలసీమ ఎదుర్కొంటున్న తీవ్ర సాగునీటి సమస్యలపై అవగాహన కల్పించారు. మే 31న జరిగే మహాసభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సమితి నాయకులు రాఘవేంద్రగౌడ్, పట్నం రాముడు మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం, పాలకుల వైఫల్యాల వల్లే నేడు సాగునీటి హక్కులు ఉండి కూడా రైతాంగం కరవు బారిన పడాల్సి వస్తోందని మండిపడ్డారు.రాయలసీమలో పండే ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలకు సరైన మద్దతు ధరలు కల్పించకపోవడం వల్ల రైతులు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.వందేళ్ళ చరిత్ర వున్న కెసి కెనాల్ స్థిరీకరణకు గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.2016 మే 31న 30,000 మందితో సాగిన 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' స్ఫూర్తితో.. రాయలసీమ ఆత్మగౌరవాన్ని, హక్కులను చాటిచెప్పడానికి నంద్యాలలో జరిగే 10వ వార్షికోత్సవ మహాసభ ఒక వేదిక కానుందని సమితి నాయకులు స్పష్టం చేశారు. ఈ హక్కుల పోరాటంలో ప్రతి ఒక్క రైతు భాగస్వామి కావాలని, మన గళమే సీమ భవిష్యత్తుకు దిక్సూచి అని పేర్కొంటూ.. బండిఆత్మకూరు మండల రైతాంగం స్వచ్ఛందంగా తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 3 లక్షల 65 వేల 131 రూపాయల చెక్కులను లబ్ధి దారులకు పంపిణీ చేసిన డోన్ ఎంఎల్ఎ కోట్ల.



**బేతంచెర్ల మే 22 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ( సిఎంఆర్ ఎఫ్ ) ద్వారా మంజూరైన మొత్తం రూ.3,65,131/- (అక్షరాలా మూడు లక్షల అరవై ఐదు వేల నూట ముప్పై ఒకటి రూపాయల )విలువైన చెక్కులను గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఆరోగ్య చికిత్సలు, అత్యవసర వైద్య అవసరాలు, ప్రమాదాలు మరియు ఇతర సంక్షేమ కారణాల నిమిత్తం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం కలిగించిందని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న దానికి ఇది నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, టిడిపి పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, మండల, పట్టణ స్థాయి అధికారులు, టిడిపి జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# జనాభా గణనను వేగవంతంగా పూర్తి చేయాలి

## సెన్సెస్ డైరెక్టర్ నివాస్
## నంద్యాల జిల్లాలో 83.26 శాతం జనాభా గణన పూర్తి :
## కలెక్టర్ రాజకుమారి
## వలస కార్మికులు, హాస్టల్ విద్యార్థుల వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి




**నంద్యాల బ్యూరో, మే 22(నంది పత్రిక):-** జిల్లాలో జనాభా గణన ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సెన్సెస్ డైరెక్టర్ నివాస్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుండి జనాభా గణన పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డీఆర్ఓ రామునాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం జనాభా సుమారు 21.36 లక్షలుగా నమోదవుతుండగా, ఇప్పటివరకు 83.26 శాతం గణన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల అంచనాల ప్రకారం జిల్లా జనాభా సుమారు 19.13 లక్షలుగా ఉండగా, గ్రామ/వార్డు సచివాలయాల డేటా ప్రకారం అది 20 లక్షల వరకు ఉండే అవకాశముందని వివరించారు. పాణ్యం మండలంలో జనాభా గణనలో వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మండల పరిధిలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలు, ఒక మెడికల్ కళాశాలతో పాటు పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండటంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అక్కడ నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలు, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు మరియు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, నంద్యాల పట్టణం బ్యాంకింగ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది విద్యార్థులు, అభ్యర్థులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. దీంతో కొంత సమాచారం ఇంకా నమోదు దశలో ఉన్నట్లు వెల్లడించారు. వలస కార్మికులు, చిన్నారులు, లేబర్ కాలనీలు, నిర్మాణ ప్రాంగణాల్లో నివసిస్తున్న కుటుంబాలు సాధారణ జిఎస్డబ్ల్యు యు పరిధిలోకి రాకపోయే అవకాశమున్నందున, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సెన్సెస్ డైరెక్టర్ సూచించారు. గుంటూరుఅమరావతి ప్రాంతాల్లో అమలు చేసిన విధానాలను ఆదర్శంగా తీసుకొని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అలాగే, లాక్ చేసి ఉన్న ఇళ్లను తిరిగి సందర్శించి వివరాలను సేకరించడంతో పాటు, ఎవరూ మిగిలిపోకుండా జనాభా గణన ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# పేద కుటుంబానికి 27 వేల ఆర్థిక సహాయం చేసిన శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి హిందూ ధర్మ ప్రచార సేవ చారిటబుల్ ట్రస్ట్

**శిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పూజారి శ్రీనివాసులు మరియు ప్రభావతమ్మ దంపతులు శుక్రవారం పేద కుటుంబానికి 27 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోటపాడు గ్రామానికి చెందిన కేడం మద్దిలేటి అనారోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఖర్చులకు మరియు మద్దిలేటి కుమార్తె విద్యాభ్యాసానికి ఈ ఆర్థిక సహాయం చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా తండ్రి అనారోగ్య పరిస్థితుల కారణంగా బాలికా విద్యకు అంతరాయం ఏర్పడకూడదన్న సదుద్దేశంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు పూజారి శ్రీనివాసులు గారు పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో చేసిన ఈ సేవాభావం పట్ల కోటపాడు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# కేసుల నిరూపణతోనే బాధితులకు నిజమైన న్యాయం.





## కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు మరియు నంద్యాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్
## నేరస్తులకు శిక్ష పడేలా కేసుల దర్యాప్తు చేపట్టాలి...
## ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు... విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు.

**నంద్యాల క్రైం, మే22(నంది పత్రిక):-** నంద్యాల జిల్లాఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నేడు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు మరియు నంద్యాల సబ్ డివిజన్ పోలీసు అధికారులతో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు గారి ఆద్వర్యంలో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు, సాక్ష్యాధారాల ప్రవేశం, మరియు నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్రపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, బాధితులకు న్యాయం జరగాలన్నా, సమాజంలో నేరాల శాతం తగ్గాలన్నా కోర్టులలో కేసుల నిరూపణ అత్యంత కీలకమని స్పష్టం చేశారు.“పోలీస్ శాఖ ఎంత కష్టపడి దర్యాప్తు చేసినప్పటికీ... కోర్టులో సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టి, కేసును నిరూపించి, నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం జరుగుతుంది. ఆ మహత్తర బాధ్యత కోర్టు కానిస్టేబుళ్లపైనే ఉంది.“అన్నారు.

**ముఖ్యమైన ఆదేశాలు:** పోలీస్ అధికారులు ప్రతి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. సాక్షులను సమయానికి కోర్టులో ప్రవేశపెట్టడం, ప్రభుత్వ లాయర్లతో సమన్వయం చేసుకోవడంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి. కోర్టులో కేసుల గురించిన సమాచారం ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు తెలుసుకొని కోర్టు కానిస్టేబుల్ లను నిరంతరం గైడ్ చేస్తూ ఉండాలన్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, నిందితులకు శిక్షలు పడేలా నిజాయితీగా కృషి చేసిన కోర్టు కానిస్టేబుళ్లను గుర్తించి, వారికి తగిన రివార్డులు మరియు ప్రశంసా పత్రాలతో ప్రోత్సహిస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, చట్టాన్ని అతిక్రమించినా లేదా నేరస్థులకు అనుకూలంగా వ్యవహరించినా ఎంతటి వారినైనా సహించేది లేదు. అలాంటి వారిపై శాఖాపరమైన కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవు. ఈ సమావేశంలో నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ ఎం.జావళి, కోర్టు మానిటరింగ్ సెల్ ( అధికారులు, మరియు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన అదికారులు కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలి



**హెచ్ఐవి బాధితులు ఎవరూ చికిత్స మధ్యలో మానేయకుండా చర్యలు తీసుకోవాలి**

**ఏఆర్టి సేవలను మరింత బలోపేతం చేయాలి**

**హెచ్ఐవీ బాధితులకు వైరల్ లోడ్ పరీక్షలు 99 శాతం పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** జిల్లాలో హెచ్ఐవి నిర్ధారణ, చికిత్స మరియు నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్య అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ అంశం పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి బాధితులు ఎవరూ చికిత్స మధ్యలో మానేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. హెచ్ఐవి చికిత్సను నిలిపివేసిన వారిని తిరిగి చికిత్సలోకి తీసుకురావడానికి ఇంటి సందర్శనలు, ఫోన్ ఫాలోఅప్స్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్టిగ్మా కారణంగా బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్న వారిని ప్రత్యేకంగా కలిసి అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఐవి బాధితులకు నిరంతరాయంగా చికిత్స అందేలా చూడాలని, మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఏఆర్టి సిబ్బంది, గ్రామీణ స్థాయి ఆరోగ్య సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మొబైల్ వాహనాల ద్వారా కూడా అవసరమైన మందులను బాధితులకు చేరవేయాలన్నారు. హెచ్ఐవి నియంత్రణలో మొదట 95 లక్ష్యాల సాధనలో జిల్లా ఇప్పటికే మొదటి లక్ష్యాన్ని చేరుకుందన్నారు. వంద మందిలో 95 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి మొదటి స్థానం జిల్లా సాధించిందన్నారు. అయితే రెండో 95 లక్ష్యంలో ఇంకా పురోగతి అవసరమని, ముఖ్యంగా చికిత్స మధ్యలో నిలిపివేసిన బాధితులను తిరిగి చికిత్సలోకి తీసుకురావడం అత్యంత కీలకమన్నారు. ప్రస్తుతం చికిత్సను నిలిపివేసిన బాధితులను తిరిగి చేర్చేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ లక్ష్యాలను సాధిస్తే కర్నూలు జిల్లా రాష్ట్రంలో ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు..హెచ్ఐవి పరీక్షలు, మందులు మరియు ఇతర వైద్య సేవల్లో ఎలాంటి కొరత లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. జిల్లాలో హెచ్ఐవీ చికిత్స పొందుతున్న ప్రతి బాధితుడికి వైరల్ లోడ్ రక్త పరీక్షలు నిర్వహించి, మందులు సక్రమంగా వినియోగిస్తున్నారో లేదో నిర్ధారించాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో వైరల్ లోడ్ పరీక్షల లక్ష్యం 99 శాతం కాగా, ఇప్పటికే 96.8 శాతం పురోగతి సాధించామని, మిగిలిన లక్ష్యాన్ని కూడా సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో రాష్ట్ర స్థాయి నుంచి వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సుకుమార్, డిఎంహెచ్ఓ డా.కామేశ్వర రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఏ పిడి రమణ రెడ్డి, జిల్లా లేప్రసీ అధికారి డా.భాస్కర్ రాజు, ఐసిడిఎస్ పిడి విజయ, డిసిహెచ్ఎస్ డా.జాఫ్రుల్లా, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవహర్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి తులసి దేవి, ఎయిడ్స్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .




## చెరువులో ఆక్రమణలపై మైనర్ ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 22:** బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నారాయణపురం గ్రామంలోని కొత్తచెరువులో కొందరు ఆక్రమణదారులు చెరువులో పొలాన్ని అక్రమంగా సాగు చేసుకుంటున్నారని ఈ విషయంపై ఆక్రమణల దారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన డి ఈ మురళీకృష్ణ, ఏఈ అర్జున్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొత్త చెరువు లో కొంతమంది వ్యక్తులు ఏళ్ల తరబడి నుండి కొత్త చెరువులో భూమిని ఆక్రమించుకొని పంటలను సాగు చేసుకుంటూ ఉన్నారు. ఈ విషయంపై గత ఏడాది మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇచ్చిన 15 రోజుల లోపల ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయంపై ఆక్రమణల దారుల నుండి ఎలాంటి చలనం కనిపించలేదు. ఈనెల 5వ తేదీన జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ ఇ శంకర్ రెడ్డి నారాయణపురం చేరుకొని కొత్తచెరువు లో ఆక్రమణ లను పరిశీలించారు. చెరువులో భూమి ఆక్రమణలకు గురైనట్టుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. చెరువులో స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. కొత్తచెరువు విస్తీర్ణం 32 ఎకరాలు ఉండగా 22 ఎకరాల భూమి ఆక్రమణకు గురి అయింది. బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో అధికారులు ఫిర్యాదు చేయడంతో పాటు నంద్యాల తాలూకా సిఐ కి కూడా ఫిర్యాదు చేశారు. బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయాన్ని తాసిల్దార్ పద్మావతమ్మ కు కూడా సమాచారం అందించారు.

## ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి గౌరవ డాక్టరేట్.....



**నంది పత్రిక ఆత్మకూరు** నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర (హిస్టరీ) అధ్యాపకుడు టి. వెంకట కృష్ణయ్యకు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ లభించింది. మణిపూర్ రాష్ట్రం ఇంఫాల్‌లోని 'బిర్ తికేంద్రజిత్ యూనివర్సిటీ' వారు శుక్రవారం ఆయనకు ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు.

**పరిశోధనకు గుర్తింపు:** "ఈశాన్య భారతదేశంలో వలస సమూహాలు - చారిత్రక కారణాలు మరియు సామాజిక-రాజకీయ ప్రభావాలు" (వీఅస్త్రతీఫ్ఆశీఅ +తీశీబజూం ఆఅ చీశీతీష్ట్రమ్ఖుర్ ×అఎఖు - ఎఅర్శీతీఅఖ్శ్రీ ఖుబంవం ఖఅఎ గాశీఎఆశీ-గాశీశ్రీఓఅఖ్శ్రీ ×ఎజూఖుమ్ం) అనే అంశంపై వెంకట కృష్ణయ్య సుదీర్ఘ పరిశోధన చేశారు. ఆయన చేసిన విశేష కృషిని మరియు ప్రతిభను గుర్తించిన సదరు విశ్వవిద్యాలయం, డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేసింది.

**కళాశాల సిబ్బంది అభినందనలు :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి జాతీయ స్థాయి విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ పద్మావతి బాయ్ మరియు తోటి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణయ్యను ఘనంగా సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఆయన సాధించిన ఈ విజయం కళాశాలకే కాకుండా ప్రాంతానికి గర్వకారణమని ప్రిన్సిపాల్ కొనియాడారు.

# రేపటితో ముగియనున్న ఎల్ఆర్‌యస్ మేళా

**ఎల్ఆర్‌యస్ దరఖాస్తుల పెండింగ్ సమస్యలకు ప్రత్యేక పరిష్కారం**

**ఫీజు చెల్లింపులు, షార్ట్‌ఫాల్ పత్రాలు, అప్రూవల్ ప్రొసీడింగ్స్ ఒకేచోట**

**చివరి అవకాశాన్ని వినియోగించుకోవాలి**

**నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు సూచన**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** నగర పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్ఆర్‌యస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ప్రజల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్‌యస్ మేళా శనివారంతో ముగియనుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి నిర్వహించిన మేళాకు విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. 21 దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందని, తద్వారా రూ.39.63 లక్షల నగరపాలకకు ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎల్ఆర్‌యస్ దరఖాస్తులకు సంబంధించిన షార్ట్‌ఫాల్ పత్రాలు, ఫీజు ఇంటిమేషన్, చెల్లింపులు, అప్రూవల్ ప్రొసీడింగ్స్ తదితర అంశాలను ఒకేచోట పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లింపులు లేదా అవసరమైన పత్రాల సమర్పణలో పెండింగ్‌లో ఉన్న వారికి ఈ మేళా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టిపిలు అందుబాటులో ఉండటంతో దరఖాస్తుదారులు అక్కడికక్కడే తమ సమస్యలను పరిష్కరించుకుని అప్రూవల్ ప్రొసీడింగ్స్ పొందవచ్చని తెలిపారు. శనివారంతో ఈ ప్రత్యేక మేళా ముగియనున్నందున ప్రజలు చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తులకు పూర్తి చట్టబద్ధత కల్పించుకోవాలని కమిషనర్ కోరారు.

## సుందర్రామిరెడ్డిని పరామర్శించిన పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి



**బద్వేల్,మే 22( నంది పత్రిక ):** బద్వేల్ మున్సిపాలిటీ వైఎస్సార్సీపీ అధ్యక్షుడు గుర్రంపాటి సుందర్రామిరెడ్డి ఇటీవల అస్వస్థతకు గురై కడపలో చికిత్స పొందిన అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున్ రెడ్డి మాట్లాడుతూ, సుందర్రామిరెడ్డి బద్వేల్ మున్సిపాలిటీలో వైఎస్సార్సీపీకి కీలక నాయకుడిగా సేవలందిస్తున్నారని తెలిపారు. ఆయన త్వరగా కోలుకొని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల వైసీపీ అధ్యక్షుడు ఎం. ప్రభాకర్ రెడ్డి, పి. సుబ్బారెడ్డి, బి. సుబ్బారెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి పల్లకి సేవ



**బనగానపల్లె మే 22నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా ఆలయ సిబ్బంది, పూజారులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## "ఫ్రైడే డ్రైడే ద్వారానే దోమలను అదుపు చేయవచ్చు" : వైద్యాధికారి మేరీ ఎలీసా



**పోరుమామిళ్ల, మే 22( నంది పత్రిక ):** పోరుమామిళ్ల మండలంలోని రాజసాహెబ్‌పేట, టేకూరుపేట తదితర పరిసర ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని వైద్యాధికారి మేరీ ఎలీసా, సబ్ యూనిట్ ఆఫీసర్ టి. నరసింహా రెడ్డి పర్యవేక్షించారు. గ్రామాలు, కాలనీలు, ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా శుభ్రపరిచే చర్యల ద్వారా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడు వాపు వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చని వారు ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి శుక్రవారం "నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు పొడిగా ఉంచడం" ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, దోమలు ఎక్కువగా నిల్వ నీటిలో పెరుగుతాయని తెలిపారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని వైద్యాధికారి మేరీ ఎలీసా తెలిపారు. గ్రామాలు, కాలనీలు పరిశుభ్రంగా ఉండడం, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెరగడం కూడా ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు.సబ్ యూనిట్ ఆఫీసర్ టి. నరసింహా రెడ్డి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రజలకు దోమలు గుడ్లు పెట్టే ప్రదేశాలు, లార్వా పెరిగే ప్రాంతాలను చూపించి అవగాహన కల్పించారు. ఇళ్లలో నీటి ట్యాంకులకు మూతలు పెట్టడం, కూలర్లు, బకెట్లు, డబ్బాలను ఖాళీ చేసి శుభ్రం చేయడం, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ కప్పులు తొలగించడం, ఫ్రిజ్ ట్రేల్లోని నీటిని తొలగించడం, పూల కుండీల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని సూచించారు. వారానికి ఒకసారి బ్లీచింగ్ లేదా లార్విసైడ్ ఉపయోగించాలని తెలిపారు.గ్రామాలు, కాలనీల స్థాయిలో డ్రైనేజీలు శుభ్రపరచడం, చెత్త తొలగించడం, నిల్వ నీటి ప్రదేశాలను గుర్తించడం, అవసరమైతే ఫాగింగ్ నిర్వహించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలు శుభ్రత కార్యక్రమాలు, ఫాగింగ్, బ్లీచింగ్, దోమల సర్వే, డెంగ్యూ కేసుల పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు.వైద్యాధికారి మేరీ ఎలీసా మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉన్నందున అత్యవసర పరిస్థితులు తప్ప బయట తిరగవద్దని, ఉదయం 10 గంటలలోపు పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, టెంకాయ నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.ఆశా కార్యకర్తలు ఇంటింటి లార్వా సర్వే, ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆసుపత్రులకు పంపించాలని, ప్రజల్లో డెంగ్యూ నివారణపై అవగాహన పెంచాలని తెలిపారు. ఏఎన్ఎంలు గ్రామాల్లో లార్వా సర్వేలు నిర్వహించి ఆరోగ్య విద్య అందించడంతో పాటు గ్రామపంచాయతీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. "ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిద్దాం", "నీరు నిల్వ కాకుండా డెంగ్యూ దూరంగా", "మన ఇల్లు శుభ్రం మన ఆరోగ్యం సురక్షితం" అనే నినాదాలతో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సరస్వతి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ బి.వి. రమణ, ఏఎన్ఎం కళావతి, ఫార్మసిస్ట్ రామప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**శాంతి కమిటీ సమావేశంలో సీఐ, ఎస్ఐ సూచనలు**



**వెలుగోడు, మే 22 (నంది పత్రిక):** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఆదేశాల ప్రకారం ఈ నెల 28న జరగనున్న బక్రీద్ పండుగను మండల ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ సురేష్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వెలుగోడు పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనలు, చట్టాలను ప్రజలకు వివరించారు. పండుగ సమయంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ సామరస్య వాతావరణంలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడదని తెలియజేసారు.మండల పరిధిలోని గ్రామాలలో ఎక్కడైనా అనుమానాస్పద లేదా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.ఇటీవల వెలుగోడు పట్టణంలో నిర్వహించిన ఉరుసు మహోత్సవాలు ఎలాంటి ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ముగియడంలో పోలీసుల సహకారం ఎంతో కీలకమైందని ఈ సందర్భంగా సామాజిక సేవకుడు అమీర్ హంజ ఆధ్వర్యంలో ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ సురేష్‌లను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, హిందూ సోదరులు, శాంతి కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సెంటర్ హీరోస్ లో అన్నదాతలకు అన్నదాన కార్యక్రమం



నంద్యాల జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి గారి ఆదేశాల మేరకు రైతులకు అన్నదానం , త్రాగునీరు అందించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం యువ నేతలు.. వైఎస్ఆర్సీపీ యువ జన విభాగం ఆధ్వర్యంలో జొన్న రైతులు గత రెండు మూడు రోజుల నుండి నంద్యాల సెంట్రల్ వేర్ హౌస్ వద్ద ఉండడంతో వారి ఆకలి తెలిసిన సాటి రైతులుగా వారికి ఆహారాన్ని , నీళ్ళ బాటిల్ లను అందించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ యూత్ జాయింట్ సెక్రటరీ పెసర వాయి ద్వారం శ్రీకాంత్ రెడ్డి , సునీల్ , సుమంత్ రెడ్డి , చంద్ర శేఖర్ రెడ్డి , గుండం నాగేష్ రెడ్డి , జయప్రకాష్ రెడ్డి....

# కులగణన పై సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం



**బనగానపల్లె మే 22 నందిపత్రిక** జనగణలో కులగణన చేపట్టే అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం బనగానపల్లె నియోజకవర్గం అధ్యక్షులు ఈ. వెంకటరమణ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కులగణనకు వ్యతిరేకంగా కొందరు దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేయడం సామాజిక న్యాయసాధన దిశగా కీలక పరిణామం అన్నారు. కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం విధానపరమైన అంశమని, ఇందులో న్యాయస్థానం జోక్యం చేసుకోబోదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం స్వాగతించ దగ్గ విషయమన్నారు. కోర్టులో కేంద్ర ప్రభుత్వం కులగణన అవసరాన్ని బలంగా సమర్పించిందని తెలిపారు. బీసీ కుటుంబాలు సర్వేలో పాల్గొనాలని, ఇంటింటికి వచ్చే బృందాలకు తమ కులం బిసిల మంటూ గర్వంగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మన సంఖ్య తెలిస్తేనే మన హక్కులు మనకు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు నందవరం శ్రీనివాసులు, టైలర్ దస్తగిరి, వెంకటాపురం శేఖర్, టైలర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## వగరూరులో కిశోరి వికాసం కార్యక్రమం



**మంత్రాలయం , మే 22,** మంత్రాలయం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సుమిత్రమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర దశలో బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమతుల ఆహారం, పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, మెన్స్ట్రువల్ హైజీన్‌పై బాలికలు సిగ్గుపడకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అలాగే బ్యాంకు ఖాతా నిర్వహణ, పొదుపు, విత్‌డ్రా వంటి ఆర్థిక అంశాలపై కూడా బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సువర్ణ, ఉపాధ్యాయులు శిల్ప తదితరులు పాల్గొని బాలికలకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు చేశారు. టీనేజ్‌లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై వివరించారు.

# రేపు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

### రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

### వినాయక ఘాట్ వద్ద లాంఛనంగా ప్రారంభం

### మంత్రి టీజీ భరత్ గుప్తా, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హాజరు

### నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 07:00 గంటలకు నగరంలోని వినాయక ఘాట్ వద్ద నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి శ్రీ టీజీ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నగర పరిశుభ్రతను మెరుగుపరచడం, ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించడం, కాలువలు, డ్రైన్లు, రోడ్లు శుభ్రపరచడం, చెత్త నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని నాలుగు వారాల పాటు ప్రత్యేక కార్యాచరణతో అమలు చేయనున్నట్లు తెలిపారు. మొదటి వారంలో రోడ్లు, జంక్షన్లు, రెడ్ & యెల్లో స్పాట్స్ శుభ్రపరిచే కార్యక్రమాలు చేపడతారని, రెండో వారంలో కాలువలు, డ్రైన్లు మరియు వీధుల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటారని వివరించారు. మూడో వారంలో వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు మరియు వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తారని, నాలుగో వారంలో ప్రజా మరుగుదొడ్లు మరియు చెత్త నిర్వహణ వ్యవస్థలను మెరుగుపరిచే చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛతలో నెంబర్-1గా నిలబెట్టడమే లక్ష్యం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన మేరకు ఈ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. నగర ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కమిషనర్ కోరారు.

## కంభగిరి స్వామి కళ్యాణోత్సవం

### బీసి ఇందిరమ్మను ఆహ్వానించిన రామ్మోహన్ స్వామి



**బనగానపల్లె మే 22నందిపత్రిక** సంజామల మండలం పేరుసోముల గ్రామంలోని శ్రీ శ్రీ కంబగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి 16వ కళ్యాణ మహోత్సవ వేడుకలు ఈ నెల 27వ తేదీన ఘనంగా నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించనున్న మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆలయ నిర్వాహకులు రామ్మోహన స్వామి శుక్రవారం మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి కి అందజేశారు.

# మహిళలపై దాడి.... వ్యక్తిపై కేసు నమోదు

### - ఎస్ఐ జయ శేఖర్

**కొత్తపల్లి - నంది పత్రిక :** ఓ మహిళపై మద్యం మత్తులో దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం రాత్రి తెలిపారు. వివరాల్లోకి వెలితే మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన సంగెం రాజు అనే వ్యక్తి గురువారం రాత్రి మద్యం తాగి తన భార్యతో గొడవ పడుతున్నాడు. అసమయంలో అతని కొడుకు వంశీ ఇద్దరికి నివారించబోయాడు. ఆసమయంలో కొడుకు తండ్రిని ఒక దెబ్బ కొట్టాడు. దాంతో కోపోద్రేకుడైన రాజు తన కొడుకును కొట్టేందుకు వెల్లాడు. అక్కడే ఉన్న రాజు తల్లి శాంతమ్మ మనుమడైన వంశీని తీసుకెల్లి తమ్ముడు భార్య అయిన సరోజమ్మ ఇంట్లో దాచింది. అయితే రాజును కొడుకు బయటికి పంపాలని ఇంటిపైకి వెళ్లాడు. కొడుకు అడ్డుకో బోయిన తల్లి శాంతమ్మను బాణంతో దాడిచేయగా కుడికాలిపై రక్తగాయాలు అయ్యాయని తెలిపారు. మరల తోయ బోతుండగా తమ్ముడి భార్య సరోజమ్మ అడ్డురావడంతో ఆమెపైకూడా భాణంతో దాడి చేయగా కడుపుపై రక్తగాయాలు అయ్యాయి. వారు ఇద్దరు భర్త సహాయంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు వెల్లి చికిత్స చేయించుకున్నారని తెలిపారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు వెల్లినట్లు ఆయన వెల్లడించారు. .దీంతోసరోజమ్మ పోలీసులను ఆశ్రయించి రాజుపై పిర్యాదు చేసింది. ఆమె పిర్యాదు మేరకు సంగెం రాజుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## హరినగరంలో జెన్ భాగీధారి కార్యక్రమం



**రుద్రవరం ప్రతినిధి మే 22 (నంది పత్రిక):** మండల పరిధిలోని హరినగరం గ్రామంలో శుక్రవారం జన్ భాగీదారి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జూన్ సున్వాయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా చెంచుల జీవనం ఇది విధానాలు నిర్దిష్ట కార్యకలాపాలు అభివృద్ధి వంటి తదితర చెంచుల పురోగతి విధానంపై క్షేత్రస్థాయిలో చెంచులతో సంప్రదించడం జరిగిందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనుల నుండి సమస్యల అర్జీలను స్వీకరించామని ఎంపీడీవో తెలిపారు. అలాగే నరసాపురం స్వర్ణ గ్రామం నందు సచివాలయం సిబ్బంది నిర్వహిస్తున్న సెన్సెస్ 2027 సర్వే ప్రక్రియను తనిఖీ చేసినట్లు ఎంపిడివో తెలిపారు. సర్వే ప్రక్రియపై ఇబ్బందిని అడిగి తెలుసుకుని సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఎంపీడీవో తెలిపారు.

## భర్త విదేశాలకు వెళ్లడంతో మనస్తాపం..
## మహిళ ఆత్మహత్య

**వెలుగోడు, మే 22 (నంది పత్రిక):** వెలుగోడు గ్రామానికి చెందిన షేక్ సానియా (భర్త: దర్గా జాకీర్ హుస్సేన్) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో , జీవనోపాధి కోసం సుమారు ఒకటిన్నర నెలల క్రితం ఆమె భర్త సౌదీ అరేబియాకు వెళ్లినట్లు తెలిపారు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన సానియా జీవితం పట్ల విరక్తి చెంది గురువారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో ఇంటి బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతురాలి తల్లి షేక్ కరిమున్నిసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# లక్షల్లో ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా

### చిలకలూరు గ్రామంలో

### శిథిలావస్థకు చేరిన దేవాలయాలులి

### శిథిలమవుతున్న చెక్క ధ్వజస్తంభం

### శిదిలావస్థకు చేరిన దేవాలయాలు.



**రుద్రవరం ప్రతినిధి మే 22 (నంది పత్రిక):** పూర్వం రాజులు, పెద్దలు దాతలు ఇచ్చిన స్థలాలలో దేవాలయాలు నిర్మించి వాటి నిర్వహణకు వందలాది ఎకరాల భూములను ఇచ్చి ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతము దేవాలయాలు శిథిలావస్థకు చేరి అభివృద్ధికి నోచుకోకుండా కనీసం దీపారాధనకు కరువైన దుస్థితి నేడు చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే మండలంలోని చిలకలూరు గ్రామంలో వందల సంవత్సరాల క్రితం ఈశ్వర ,చెన్నకేశవ స్వామి ఆలయాలను నిర్మించారు. ఆలయానికి దాదాపు 40 ఎకరాల మాన్యం భూమి ఉంది. భూముల ద్వారా వచ్చే ఆదాయంతో పురోహితుని జీతభత్యాలు, దీపారాధన, ఆలయ అభివృద్ధికి వినియోగించాల్సి ఉంది. ప్రతి ఏడాది ఆలయ భూములకు వేలం పాటలను నిర్వహించి పాటలలో వచ్చే ఆదాయాలను తీసుకొని వెళ్తున్నారే తప్పా ఆలయాల అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయడం లేదు. గ్రామంలోని ఈశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి ఆలయాల ఎదుట ఏర్పాటుచేసిన అప్పటి ధ్వజ స్తంభాల సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఆలయాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో అవి కాస్త శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రతి ఏడాది ఈ రెండు దేవాలయాలకు సంబంధించిన దాదాపు 40 ఎకరాల మాన్యం భూములకు వేలం పాటలు ద్వారా రూ 5 లక్షల 6 లక్షల రూపాయల వరకు వస్తున్నాయి. ఈ డబ్బుతో దేవాదాయ శాఖ అధికారులు రెండు దేవాలయాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. అభివృద్ధి దేవుడి ఎరుగు కనీసం దేవుళ్లకు నైవేద్యం పెట్టడానికి కూడా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నిర్వహించిన వేలంపాటల్లో గ్రామస్తులు దేవదాయ శాఖ అధికారులతో దేవాలయ మాన్యం భూములకు ఇంత ఆదాయం వస్తున్నప్పటికీ ఎందుకు ఆలయాలను అభివృద్ధి చేయడం లేదని అధికారులను గ్రామస్తులు నిలదీయడమే ఎందుకు నిదర్శనం. ఈ ఏడాది ఆలయాల అభివృద్ధిని చేస్తామని హామీ ఇచ్చి అధికారులు వెళ్లిపోయి ఇంతవరకు ఆలయాల వైపు కన్నెత్తి చూడని దుస్థితి గ్రామంలో ఏర్పడిందన్నారు. ఆలయాల అభివృద్ధి చేయకపోయినా పర్వాలేదు కనీసం ప్రతి ఏడాది వేలం పాటల ద్వారా వచ్చే నగదు, ఆలయాల ఖర్చులను గ్రామస్తులకు చెప్పడానికి కూడా అధికారులు ముందుకు రావడం లేదని ఆరోపిస్తున్నారు. దేవాలయ ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన రెండు దేవాలయాలను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# అధికారుల నిర్లక్ష్యం

### కుప్పకూలిన పురాతన చెన్నకేశవ స్వామి ఆలయ పై కప్పు!

### మన్యం భూములున్నా పట్టించుకోని ఎండోమెంట్ అధికారులు

### కమిటీ ఉన్నా లేనట్లే భక్తుల తీవ్ర ఆగ్రహం



**నందిపత్రిక -ప్యాపిలి** మండల కేంద్రమైన ప్యాపిలిలో అపచారం జరిగింది. శతాబ్దాల చరిత్ర కలిగిన, అత్యంత పురాతనమైన చెన్నకేశవ స్వామి ఆలయ పైకప్పు గురువారం రాత్రి కూలిపోయింది. గత కొంతకాలంగా ఆలయం శిథిలావస్థకు చేరినా, సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు , స్థానిక కమిటీ సభ్యులు పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎకరాల భూములున్నా.. ఎండబెట్టారు!** విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ పురాతన చెన్నకేశవ స్వామి ఆలయానికి ఎకరాల మన్యం భూములు ఉన్నాయి. ఈ భూముల ద్వారా ఏటా భారీగానే ఆదాయం వస్తున్నప్పటికీ, ఆలయ నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు.

**కమిటీ ఉన్నా లేనట్లే.. అధికారుల నిద్రమత్తు!** ఆలయ పర్యవేక్షణ కోసం అధికారికంగా కమిటీ ఉన్నప్పటికీ, అది కేవలం కాగితాలకే పరిమితమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ గోడలు బీటలు వారి, కూలిపోయే స్థితికి చేరినా ఎండోమెంట్ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. అధికారుల నిర్లక్ష్యం, కమిటీ సభ్యుల బాధ్యతారాహిత్యం వల్లే గురువారం రాత్రి ఆలయ పైకప్పు కూలిందని గ్రామస్థులు మండిపడుతున్నారు.

**వెల్లువెత్తుతున్న నిరసనలు..** చారిత్రక సంపదగా నిలవాల్సిన ఆలయం ఇలాశిథిలమైపోవడంపై భక్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడి, తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలయ పైకప్పు కూల్చివేతకు కారణమైన నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలని, మన్యం భూముల ఆదాయాన్ని రాబట్టి, చెన్నకేశవ స్వామి ఆలయాన్ని పునర్నిర్మించాలని ప్యాపిలి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లాలో బాల్యవివాహాలు,
## టీనేజీ ప్రెగ్నెన్సీ లను పూర్తిగా నివారించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి




**కర్నూలు నంది పత్రిక బ్యూరో..** ..జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణ పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇంకా బాల్యవివాహాలు,టీనేజీ ప్రెగ్నెన్సీ లు నమోదు అవుతున్నాయని, వీటిపై నిరంతరం నిఘా ఉంచి పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీస్ , ఏఎన్ఎం, ఆశ సిబ్బంది వారి పరిధిలో కౌమార దశలో ఉన్న బాలికలను, వారి తల్లిదండ్రులతోనూ సంప్రదిస్తూ బాల్య వివాహాలు చేయకుండా, టీనేజ్ గర్భం దాల్చకుండా వారికి సరైన సూచనలు చేయాలని,ఇందువల్ల జరిగే దుష్పరిణామాలను వివరించాలని ఆదేశించారు. అమ్మాయిలు చిన్న వయసులోనే గర్భం దాల్చడం వలన జరిగే నష్టాలను, ఇబ్బందులను కర్నూలు జిల్లా వైద్య విద్యార్థినుల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వో ను, ఫోన్ ద్వారా కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ ను ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా, టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదు కాకుండా చైతన్యం తీసుకు వచ్చేలా కళాజాత బృందాలను, బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచార రధము, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఐసిడిఎస్ పిడి విజయ ను ఆదేశించారు.సమావేశంలో కర్నూలు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా , డిఎం హెచ్ ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ , ఐ సి డి ఎస్ పిడి విజయ పాల్గొన్నారు.

# చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి విరాళం





**బనగానపల్లె మే 22నందిపత్రిక** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందవరం దేవస్థాన అభివృద్ధి కి నంద్యాల జిల్లా, బనగానపల్లి మండలం నందవరం గ్రామ వాస్తవ్యులు నుశి వెంకట రెడ్డి ధర్మపత్ని లక్ష్మీదేవమ్మ గార్ల కుమారుడు కీ'శే' నుశి రమణారెడ్డి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని శంకరమ్మ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు శుక్రవారం రూ. 1,00,101 చందాను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు.

**హుండీల బహుకరణ** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు నంద్యాల జిల్లా, బనగానపల్లి మండలం, నందవరం గ్రామం లో గల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, నందవరం శాఖ అమ్మవారి దేవస్థానమునకు 2 స్టీల్ హుండీలు శాఖ ఆర్ ఎం . ఎం . సుధాకర్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ . శ్రీనివాస రెడ్డి ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి , ఏపీజీబీ శాఖ మేనేజర్ లక్ష్మీ ప్రసన్న , క్యాషియర్ జి . రామలింగేశ్వరుడు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన వీఆర్వోకు సన్మానం

**మంత్రాలయం మే 22,..** మంత్రాలయం మండలం బూదురు గ్రామంలో గ్రేడ్ 2వీఆర్వో గా విధులు నిర్వహించిన అల్లా బకాష్ ,. బదిలీపై ఆస్పరి మండలానికి గ్రేడ్1 వి ఆర్ ఓగా వెళ్లారు. శుక్రవారం తాసిల్దార్ రమాదేవి వీఆర్వోలు ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లే వీఆర్వోను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఆనంద్ ప్రభాకర్ , భీమన్న, వన్నూరుప్ప, సర్వేర్ బీరప్ప, హేమచంద్ర , వీఆర్ఏలు విజయ్,యేసురాజు, సిబ్బంది వీరేష్ ఎర్రప్ప,నాగభూషణ స్వామి,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -99 రోజుల కార్యాచరణపై జిల్లా స్థాయి సమావేశం.






## జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పనిచేయాలి:జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్.

**మహబూబాబాద్, మే 22(నంది పత్రిక):** శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ప్రజా పాలన సమావేశం ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అధ్యక్షతన నిర్వహించగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ... ఆలపించి, ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభా ప్రాంగణంలో రెండు పడకల గదుల నిర్మాణం, ఆయిల్ పామ్, వ్యవసాయ, పరిశ్రమలు, వైద్య ఆరోగ్యశాఖ, ఇండియన్ రెడ్ క్రాస్, చేనేత వస్త్రాల తదితర శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు జిల్లాలో అమలు, జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారంపై చర్చ, ప్రస్తుత నూతన పథకాలు 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్న విధానంపై సమావేశం లో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చేరువగా పాలన అందించడానికి క్షేత్రస్థాయిలో జవాబుదారితనం పారదర్శకతతో కూడిన మెరుగైన పాలనను ప్రజా అభిప్రాయానికి, ప్రత్యేకించి నిరుపేద అణగారిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సామాజిక న్యాయ ఆర్థిక సాధికారిక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తులను డిజిటలైజ్ చేసి సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిలో రాష్ట్రంలో జిల్లా ఆరవ స్థానంలో ఉందని, మిగిలిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ఐదవ స్థానంలో జిల్లా ఉందని, ఇంటర్మీడియట్ , వృత్తివిద్య కోర్సులపై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగుతామన్నారు. స్వీయ గణన, ఇండ్ల గణన సర్వేలు జిల్లా ప్రణాళిక ప్రకారం సర్వే కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ వివరాలను ఇవ్వాలని కోరారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్లో వేగంగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని, ఇతర వాణిజ్య పంటలు పామ్ ఆయిల్, పప్పు దినుసులు, సేంద్రీయ వ్యవసాయం, ఎరువులు, సెరికల్చర్, హార్టికల్చర్, పంటలపై రైతులకు అధిక లాభాలు వస్తాయని ఆ దిశగా రైతులు ముందుకు సాగాలన్నారు. యూరియా అధిక వాడకం వలన భూమి సారవంతం కోల్పోయి రైతులకు నష్టం కలుగుతుందని, నానో యూరియా, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. జిల్లాలో గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొని స్పెషల్ టీంలను ఏర్పాటు చేశామని, యువత బానిసలు కాకుండా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాల అమ్మకం, నిలువలపై కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొని జిల్లా స్పెషల్ టీం నిరంతరం నిఘా పెట్టడం జరిగిందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయని, తద్వారా కుటుంబ పోషణ బాధ్యతలు చూసుకోవడం జరుగుతుందన్నారు. అందుకే ఆడపిల్లలకు ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రతి ఒక్కరికి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే జిల్లాలో సుమారు 6వేల మంది నిరుద్యోగులు తమ దరఖాస్తులను ఉపాధి కల్పన అధికారి దగ్గర నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పదవ తరగతి పూర్తి అయిన వెంటనే వృత్తి విద్యా శిక్షణ తరగతులలో చేరి ఉపాధి పొందాలని తెలిపారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలోని 562 కోట్ల 11 లక్షలు 6వేల931 మంది, మెప్మా 97 కోట్లు 33 లక్షల 48వేలు 609 సంఘాలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం గృహజ్యోతి, సన్న వడ్లకు బోనస్, చేయూత పథకం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక బృందాలకు, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ, రేషన్ కార్డు తదితర ఆరు గ్యారెంటీలకు పథకాల అమలుతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన అల్పాహార పథకం (ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు), ఇందిరమ్మ కుటుంబాలకు జీవిత భీమా పథకం, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ వరకు పొడిగింపు, ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగులైన విద్యార్థులకు మోటర్ వాహనాల పంపిణీ, పంటల వైద్యుయకరణ, ప్రకృతి సేంద్రీయ వ్యవసాయం అమలు చేస్తున్న పథకాలపై అర్హులైన లబ్ధిదారులకు అందించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుండి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ళ క్లియరెన్స్, ఏప్రిల్ 6 నుండి 11 వరకు వయో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు బాలికలు ఆరోగ్య విషయంలో అవగాహన కార్యక్రమాలు, ఏప్రిల్ 13 నుండి 18 వరకు రోడ్డు భద్రత హెల్మెట్ ధరించడం తదితర అంశాలపై, ఏప్రిల్ 20 నుండి 25 వరకు సంక్షేమ కార్యక్రమాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహ ప్రవేశాలు, ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు మత్తు పదార్థాలను నివారణ, బాల్య వివాహాల నిర్మూలించుటకు అవగాహన కార్యక్రమాలు, మే 4 నుండి 9 వరకు రైతు సంక్షేమ వారోత్సవాలు, మే 11 నుండి 16 వరకు విద్య వారోత్సవాలు ఘనంగా నిర్వహించామని, మే 18 నుండి 23 వరకు యువత క్రీడోత్సవం కొనసాగుతుందని, మే 25 నుండి 30 వరకు మహిళలందరికీ స్వయం సహాయక బృందాల సభ్యులకు పొదుపు చర్యలు తదితర అంశాలపై అవగాహన, జూన్ 1 నుండి 12 వరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో తీసుకోవలసిన చర్యలు, నర్సరీలు పెంచడం, పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాల నిర్వహణ విజయవంతానికి ఇప్పటికే జిల్లా అధికారులకు పూర్తి బాధ్యతలు అప్పగించి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా అన్ని పారామీటర్లలో ముందంజలో ఉందని మరింత అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కె.అనిల్ కుమార్, పిడి హౌసింగ్, జెడ్పి సీఈవో పురుషోత్తం, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్, డీఎస్పీ తిరుపతిరావు, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్లు, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు, స్వయం సహాయక బృందాలు, జిల్లాలోని అందరూ ఎంపీడీవోలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్ నినో పుస్తక ఆవిష్కరణ

### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎల్ నినో పరిస్థితిని ఎదుర్కొని విజయవంతంగా వ్యవసాయం చేసే ప్రకృతి వ్యవసాయ విధానాలు మరియు పద్ధతుల గురించిన పుస్తకం ను గౌరవనీయులు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తమ కార్యాలయం లో ఎల్ నినో పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ రైతులందరూ పూర్తిస్థాయిలో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే విధంగా రైతులకు ఒకే రకమైన పంట కాకుండా పలు రకాల పంటలు వేసుకొనే విధంగా అవగాహన కల్పించి రాబోయే ఖరీఫ్ సీజన్లో మంచి దిగుబడిలో వచ్చేల అవగాహన కల్పించాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి పి.ఎల్. వరలక్ష్మీ , ప్రకృతి వ్యవసాయ జిల్లా డిపిఎం ఏ. మాధురి , డిఎల్ఎంపి లక్ష్మయ్య మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రైతులు పొలాల్లో పండ్లతోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి... ఏపీఓ రేష్మ



**జూపాడుబంగ్లా: మే :22: (నంది పత్రిక)** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సన్న చిన్న కారు రైతుల ఆర్థిక అభివృద్ధికి రైతుల పొలాల్లో పండ్లతోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో రేష్మ కోరారు. ఈ సందర్భంగా ఏపీవో రేష్మ మాట్లాడుతూ సన్న చిన్న కారు రైతుల ఆదాయ అర్జునతోపాటు, ఉపాధి కూలీలకు నిరంతరం పని కల్పించే లక్ష్యముతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పండ్ల తోటల పెంపకం ద్వారా సన్నాచిన్న కారు రైతులకు ఆదాయాన్ని సమకూర్చాలని ఆలోచనతో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. 25 సెంట్లు నుండి 5 ఎకరాల భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు ఈ పథకానికి అర్హులని మూడు సంవత్సరాల పాటు తోటల పెంపకంను, అంతర పంటలు వేసుకుంటే మరింత ఆదాయాన్ని అర్జించడానికి తోడ్పాటు ఉంటుందన్నారు. చిన్నా సన్న కారు రైతుల వ్యవసాయ క్షేత్రాలలో ఉద్యాన తోటలు పెంపకానికి మామిడి, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, డ్రాగన్, ఆయిల్ ఫామ్, కోకో, గులాబీ, మల్లె మునుగా పంటలు పెంపకాడికి ఆసక్తి కలిగిన రైతుల వ్యవసాయ క్షేత్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలను నాటి మూడు సంవత్సరాల పాటు పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర పంటలు వేసుకుంటే మరింత ఆదాయాన్ని అర్జించడానికి తోడ్పడుతుందన్నారు.

# ఎండ తీవ్రత దృష్ట్యా మార్కెట్ కు సెలవులు.




**కేసముద్రం, మే 22(నంది పత్రిక):** విపరీతంగా పెరిగిన ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కు సెలవులను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ప్రకటించారు. ఎండ తీవ్రత సుమారు 48 డిగ్రిలకు చేరడంతో కూలీలు, హమాలీలు, గుమస్తాలు తీవ్ర అనారోగ్యం, అస్వస్థతకు గురౌతున్నందున గుమస్తా సంఘం, కార్మిక సంఘాల తరుపున మే 25 సోమవారం నుండి మే 29 శుక్రవారం వరకు సెలవులను ప్రకటించారు. మే 23 శనివారం వారాంతపు సెలవు, మే 24 ఆదివారం ప్రభుత్వ సెలవు, మే 25 నుండి మే 29 వరకు గుమస్తా, కార్మిక సంఘాల కోరిక మేరకు, మే 30 శనివారం వారాంతపు సెలవు, మే 31 ఆదివారం ప్రభుత్వ సెలవు తిరిగి జూన్ 01 సోమవారం రోజున మార్కెట్ పునః ప్రారంభమగును. కావున రైతు సోదరులు ఈ విషయాన్ని గమనించి పైన తెలిపిన మార్కెట్ సెలవు రోజులలో మీయొక్క మిర్చి, ఇతర సరుకులను తీసుకవచ్చి ఇబ్బందులకు గురికావద్దని మార్కెట్ చైర్మన్ తెలిపారు.

# కేసముద్రంలో శంకుస్థాపనకే పరిమితమైన అగ్నిమాపక కేంద్రం.

### తక్షణ చర్యలు తీసుకోవాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

**కేసముద్రం, మే 22(నంది పత్రిక):** కేసముద్రం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కేవలం శంకుస్థాపనకే పరిమితమైందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పడిందని, అనేక మిల్లులు, ట్రేడింగ్ కంపెనీలు, బట్టల దుకాణాలతో పాటు వివిధ రకాల షాపులతో అనేకమంది కార్మికులు జీవిస్తున్నారని తెలిపారు. గతంలో మిల్లులు, దుకాణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరిగాయని, మహబూబాబాద్ జిల్లా, కేంద్రం నుండి అగ్నిమాపక వాహనం రావడం అలస్యం కావడం చేత ప్రజలు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన ఫైర్ స్టేషన్ కు స్థల సేకరణతో అధికారులు చేతులు దులుపుకున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలతో భాగంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు శంకుస్థావన చేశారన్నారు. కానీ అగ్నిమాపక కేంద్రం నిర్మాణ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని, గురువారం ప్రమాదవశాత్తూ ఏర్పడిన అగ్ని ప్రమాదంలో మండలంలోని అర్పణపల్లి, కోరుకొండపల్లి గ్రామాల్లో అగ్ని ప్రమాదం సంభవించి వందల ఎకరాల్లో రైతులు తీవ్రంగా నష్ట పోయారని తెలిపారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జన్ను రాజేందర్, నల్లగొండ వెంకన్న, మౌలారా, జిలాని, వెంకన్న, ఉన్నలయ్య పాల్గొన్నారు.




# గోమాత గొప్పతనం చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల్లో తెలుసుకోవడం అదృష్టంగా ఉంది..





## రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా చాగంటి కోటేశ్వరరావు యుగ పురుషుడు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరంలో ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు యుగ పురుషుడు అని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూల్ నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో గోమాత వైభవంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తాతో కలిసి టీజీ వెంకటేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా గోమాతకు పూజ చేసి అనంతరం గో ప్రాధాన్యత.. గోసేవావశ్యకత అనే పుస్తకం ఆవిష్కరించారు. మొదటి పుస్తకాన్ని టీజీ వెంకటేష్, టీజీ భరత్ లకు చాగంటి కోటేశ్వరరావు అందించారు. అనంతరం టీజీ వెంకటేష్ మాట్లాడుతూ చాగంటి లాంటి గొప్ప వ్యక్తులు ఉన్నారు కాబట్టే మనమందరం బాగున్నామని చెప్పారు. చాగంటి అనుకుంటే వందల కోట్లు సంపాదించొచ్చు కానీ చాగంటికి డబ్బుపై ఆశ లేదని.. ఆయనకు తెలిసినది ప్రజలకు చెప్పడమే ఆయనకు తెలుసన్నారు. టీజీ భరత్ గోమాతకు పూజ చేయడం, గోవులను సంరక్షించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. చాగంటి కోటేశ్వరరావు తమకు సన్మానం చేయడం తమ పూర్వజన్మ సుకృతం అని టీజీ వెంకటేష్ అన్నారు. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ చాగంటి కోటేశ్వరరావు కర్నూలుకు రావడం తమ అదృష్టం అన్నారు. క్యాబినెట్ ర్యాంక్ ఉన్నప్పటికీ ఆయన సామాన్యుడిలాగే ప్రయాణం చేస్తారని చెప్పారు. రాజకీయాల్లో ఎలా ఉండాలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల్లో తెలపాలన్నారు. ఏపీలోనే అతిపెద్ద గోశాల కర్నూలులో ఉందన్నారు. గాయత్రి గోశాలలో 1200 పైగా ఆవులు ఉన్నాయన్నారు. గోమాతకు ఎలా పూజ చేయాలో పుస్తక రూపంలో తెలుపడం వల్ల ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి గోశాల, గాయత్రి గోసేవ సమితి సభ్యులు పాల్గొన్నారు. చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ గోసేవ ఎంతో గొప్పదని చెప్పారు. గోవును దానం చేయడం అంత గొప్ప దానం ఇంకోటి లేదన్నారు. ప్రతి రోజూ గోమాత సేవ చేయాలన్నారు. మనసు ఉత్సాహంగా ఉండాలంటే గోవును స్మరిస్తూ ఉండాలన్నారు. గోవులు సంచరించిన ప్రదేశం కంటే పవిత్రమైన ప్రదేశం ఇంకెక్కడా ఉండదు అని ఆయన అన్నారు.



## బంగారాన్ని గులాబీ రంగు కాగితంలోనే ఎందుకు చుడతారు? కారణం ఇదే!

గులాబీ రంగు కాగితంలో బంగారం మరింతప్రకాశవంతంగా కనిపించడం భారతీయ సంస్కృతిలో శుభానికి, సంపదకు చిహ్నంగా ఈ సంప్రదాయం ఆధునిక ప్యాకేజింగ్ వచ్చినా కొనసాగుతున్న దశాబ్దాల నాటి నమ్మకం

భారత్‌లో జ్యువెలరీ షాపులకు వెళ్తే ఒక విషయం మనకు సర్వసాధారణంగా కనిపిస్తుంది. కొన్న బంగారు ఆభరణాన్ని బాక్సులో పెట్టే ముందు, ఒక ప్రత్యేకమైన గులాబీ రంగు కాగితంలో జాగ్రత్తగా చుట్టి ఇస్తారు. ఇది కేవలం అలంకరణ కోసమే అనుకుంటే పొరపాటే. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం వెనుక శాస్త్రీయ, మానసిక, సాంస్కృతిక కారణాలు ఉన్నాయని నిపుణులు వివరిస్తున్నారు.

# ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలి





### ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో 170 అర్జీల స్వీకరణ

### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్ మే 22నంది పత్రిక** ఆచంట బాలంవారి పాలెంలోని పి-4 భవనంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులకు తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ దాసిరాజు, డీపీఓ వై.దోసిరెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి. పిచ్చయ్య తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను శాఖల వారీగా పరిశీలించి, సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారంపై సూచనలు జారీ చేశారు. ముందుగా మే 15న నిర్వహించిన తొలి విడత పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలపై శాఖల వారీగా చేపట్టిన పరిష్కార చర్యలను ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో నెలలో నాలుగు వారాల పాటు పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆచంట నియోజకవర్గంలో రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల నుండి అందిన అర్జీలను అధికారులు నిశితంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీలను పరిశీలించకుండా మూసివేయరాదని స్పష్టం చేశారు. తమ శాఖ పరిధిలోకి రాని అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు వెంటనే బదిలీ చేయాలని ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యల విషయంలో అర్జీదారులకు కారణాలను స్పష్టంగా తెలియజేసి, ప్రభుత్వ స్థాయిలో పరిష్కారానికి అవసరమైన నివేదికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. రెండు విడతలుగా నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యల నివేదికలతో తదుపరి సమావేశానికి హాజరు కావాలని సూచించారు. తదుపరి మూడో, నాలుగో శుక్రవారాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్ నాటికి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నేడు నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 170 అర్జీలు స్వీకరించబడినట్లు తెలిపారు. అందులో ఆచంట మండలం నుండి 116, పెనుమంట్ర మండలం నుండి 17, పోడూరు మండలం నుండి 8, పెనుగొండ మండలం నుండి 29 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు, వితంతు పింఛన్లు, వికలాంగ పింఛన్లు, ఉపాధి, భూ సమస్యలు తదితర అంశాలపై ఎక్కువ సంఖ్యలో అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించి ప్రజలకు మరింత చేరువ కావాలనే ప్రభుత్వ లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలని సూచించారు. చివరి విడత పీజీఆర్ఎస్ ముగిసే నాటికి నియోజకవర్గంలోని అర్జీలను నూరు శాతం పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు. పోడూరు మండలం పండితవెల్లూరు గ్రామానికి చెందిన వీరా శ్రీనివాసమూర్తి తాను ఎంబీఏ చదివానని, బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స అనంతరం కంటి చూపు కోల్పోయానని, వికలాంగుల కోటాలో ఉద్యోగం కల్పించాలని అర్జీ సమర్పించారు. పెనుగొండ మండలానికి చెందిన డి. వెంకట్రామిరెడ్డి తనకు 3.15 సెంట్ల భూమికి పట్టాదార్ పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డులో నమోదు కాలేదని, నమోదు చేయించాలని కోరారు. పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరానికి చెందిన చవాకుల కుమారి ఇంటి స్థలం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఆచంట గ్రామానికి చెందిన కొక్కెర సరోజినీ వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరారు. పెనుమంట్ర మండలం నెలమూరుకు చెందిన చింతపల్లి సోమేశ్వరరావు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ కె.శివపార్వతి, డీఆర్‌డీఏ పీడీ ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, డిఎంఅండ్ హెచ్ ఓ గీతాబాయి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డీఎస్‌ఓ ఎన్.సరోజ, జిల్లా కార్మిక శాఖ అధికారి ఏ.లక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి యు.వి.అరుణకుమారి, ఏఎంసీ చైర్మన్ కేతా మీరయ్య, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



# అహోబిలంలో తలనీలాల వేలంపాట రద్దు



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 22,నంది పత్రిక** అహోబిలం మఠం పరంపరాదిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో 2027 మార్చి 31తో ముగిసే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మానవ కేశాల సేకరణ, అలాగే విసర్జన హక్కుల వేలం కోటి యాభై లక్షల రూపాయలతో కనిస ధరను నిర్ణయించిన వేలం పాట 22 వ తేదీ శుక్రవారం పోలీసుల గట్టి బందోబస్తుతో బహిరంగ వేలం సెడ్యూల్ చేసి నిర్వహించారు. వేలం ప్రక్రియ ప్రారంభమైనప్పుడు, టెండరు దారులు నిర్ణయించిన కనీస ధరను అలాగే వేలం నిబంధనలను తగ్గించమని, సడలించమని కోరుతూ సంప్రదింపులు జరిపారు. వేలం ప్రక్రియలో ప్రకటించిన కనీస ధరకు అంతకంటే ఎక్కువ ధరకు చెల్లుబాటయ్యే బిడ్‌ను దాఖలు చేయడానికి ఏ ఒక్కరు ముందుకు రాకాపోవడంతో వేలం పాటను దేవస్థానం సి ఎ ఒ పార్థసారధి రద్దు చేశారు. ఈ వేలంపాటను అహోబిలం మఠం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తిరిగి ప్రకటించడం జరుగుతుందని దేవస్థానం సి ఎ ఒ పార్థసారధి తెలిపారు. ఈ టెండరు ప్రక్రియకు సీఐలు నాగ రాజారావు, బి వి రమణ, ఎస్ ఐ లు వరప్రసాద్, జయప్ప, శ్రీకాంత్, రామిరెడ్డి లు తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## సహకార రాజీ పరిష్కార పథకము అందజేస్తున్న గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు దానమయ్య



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ డి. విష్ణువర్ధన్ రెడ్డి ఆలోచనల మరియు ఆదేశాల అనుసారం ఉమ్మడి కర్నూలు జిల్లా నందుగల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల లో రుణం తీసుకొని చెల్లించలేక చనిపోయినటువంటి రైతుల వారి కుటుంబ సభ్యుల ఆవేదనను అర్థం చేసుకొని మునిపెన్నడూ లేని విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో " సహకార రాజీ పరిష్కార పథకం "అని కొత్త పథకం ద్వారా చనిపోయిన రైతుల యొక్క రుణాలు చెల్లించలేక అపరాధ వడ్డీ కట్టలేని స్థితి గల రైతుల కుటుంబాలకు ఈ పథకం ద్వారా 31. 03.2026 లోపల ఆ రుణం మొత్తం చెల్లించిన వారికి అపరాధ వడ్డీని మాఫీ చేయవలసినదిగా కర్నూలు జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, బ్రాంచ్ లు మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఆదేశించడం అయినది. డి. విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు బి. దానమయ్య ఆధ్వర్యంలో మా సంఘం నందు 31. 03.2026 లోపు చెల్లించిన రుణాలకు సంబంధించిన అపరాధ వడ్డీని వారి నామిని ఖాతాలకు జామ చేయడమైనదని తెలుపుచున్నాము ఇందుకుగాను మన సహకార సంఘం ఒక లక్ష యాభై వేల రూపాయలు ఐదు మంది రైతుల కుటుంబాలకు ఈ పథకం ద్వారా అపరాధ వడ్డీని చెల్లించడమైనది ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రేమట వెంకటేష్, అలిపిర,సంఘ సీఈవో, సంఘ సిబ్బంది మరియు రైతుల కుటుంబాలు పాల్గొన్నారు.

# దేశ భద్రతా వ్యవస్థకు కీలకంగా మారనున్న డ్రోన్ ల వినియోగం





### ఇన్చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.

**నరసాపురం బ్యూరో చీఫ్ మే 22నంది పత్రిక** దేశ రక్షణ దళాల ఆధునికీకరణలో భాగంగా సైనిక సిబ్బందికి డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ అందించేందుకు చేపట్టిన 10 రోజుల సమగ్ర శిక్షణ కార్యక్రమం పెదమైనవానిలంక డిజిటల్ భవన్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని సైయంట్ ఎఐ అండ్ ఫ్యూచర్ స్కిల్స్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రోత్సాహం, సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణలో భారత ఆర్మీ, నేవీ మరియు ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సైనిక సిబ్బంది పాల్గొన్నారు. దేశ భద్రతా రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. శిక్షణలో భాగంగా డ్రోన్ అసెంబ్లీ, డ్రోన్ ఆపరేషన్, సర్వైలెన్స్ టెక్నిక్స్, వ్యవసాయం మరియు రక్షణ రంగాల్లో డ్రోన్ల వినియోగం, డ్రోన్ రూల్స్2021, భద్రతా ప్రమాణాలు, ప్రాక్టికల్ ఫ్లయింగ్ సెషన్లపై నిపుణులచే సమగ్ర శిక్షణ అందించబడింది. ఆధునిక యుద్ధ విధానాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ శిక్షణ సైనికులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. శిక్షణ పూర్తిచేసుకున్న సైనికులు భవిష్యత్తులో ఎన్‌సీసీ క్యాడెట్లకు కూడా డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తద్వారా యువతలో సాంకేతిక అవగాహన పెంపొందించడంతో పాటు దేశ రక్షణ రంగానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహించిన సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో పశ్చిమ గోదావరి ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, నరసాపురం తహసీల్దార్ ఐ. సత్యనారాయణ, కేంద్ర మంత్రి ప్రతినిధి పేరాల మోహన్, పి.ఎం. లంక డిజిటల్ భవన్ నాక్ ఏడి వసంతరావు, సైయంట్ ఫౌండేషన్ ప్రతినిధులు పివిఎస్ శర్మ, జె. ప్రసాద్ పాల్గొని శిక్షణ పూర్తి చేసిన సైనికులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే కాలంలో రక్షణ రంగంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం మరింత విస్తరించనున్న నేపథ్యంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దేశ భద్రతా వ్యవస్థకు కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అత్యాధునిక సాంకేతిక శిక్షణ అందించడం ద్వారా యువతకు మరియు సైనికులకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. డ్రోన్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఎన్‌సీసీ మరియు ఆర్మీకి చెందిన 5 మంది మహిళలు, 15 మంది పురుషులు కలిపి మొత్తం 20 మందికి పెదమైనవానిలంక డిజిటల్ భవన్‌లో సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, శిక్షకులు, సైనిక సిబ్బంది మరియు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.



## రోడ్ల పైన, షాపులు ముందు ఇష్టానుసారం చెత్తను వేస్తే అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి

### ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి .



**నరసాపురం బ్యూరో చీఫ్ మే 22నంది పత్రిక** నరసాపురం పట్నంలోని పంజా సెంటర్ ప్రాంతాన్ని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూరగాయల దుకాణాల వద్ద రోడ్డుపై కుళ్లిపోయిన కూరగాయలు, ప్లాస్టిక్ కవర్లు మరియు ఇతర వ్యర్థాలు చిందరవందరగా పడివుండటాన్ని గమనించిన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయల దుకాణ యజమానిని పిలిపించి పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల మందలించిన ఇన్‌చార్జి కలెక్టర్, దుకాణాల వద్ద ఇష్టానుసారంగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పారవేయడం వలన పరిసరాలు కాలుష్యానికి గురై ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. దుకాణాలలో ఏర్పడే చెత్తను ఒకేచోట సేకరించి, మున్సిపల్ సిబ్బందికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై మరియు ఆరుబయట చెత్త వేయడం వలన ఈగలు, దోమలు పెరిగి దుర్వాసన వ్యాపిస్తుందని, తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పట్టణ పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి వ్యాపారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా సమీపంలోని ఒక ఎలక్ట్రికల్ షాప్ వద్ద కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు పడివుండటాన్ని గమనించిన ఆయన, మరోసారి ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అపరాధ రుసుములు విధిస్తామని హెచ్చరించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి తొట్టెలో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఇన్‌చార్జి కలెక్టర్ వెంటనే వాటిని తొలగించి పరిశుభ్రంగా నిర్వహించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంలో నరసాపురం మండల తహసీల్దార్ ఐ.సత్యనారాయణ, తదితర, అధికారులు పాల్గొన్నారు



## 5వ దశ రీ సర్వేను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా గడువులోగా పూర్తి చేయాలి

### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్ మే 22నంది పత్రిక** 5వ దశ రీ సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను పశ్చిమ గోదావరి ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్, ఈ-కేవైసీ కార్యక్రమాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియలో అమలు చేస్తున్న విధానాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే సమయంలోనే రైతులు మరియు భూ యజమానుల వ్యక్తిగత వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ సూచించారు. భూ రికార్డులు భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా సమగ్రంగా, సక్రమంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా తప్పిదాలు చోటుచేసుకుంటే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే కార్యక్రమం ద్వారా భూ హక్కులకు మరింత రక్షణ లభిస్తుందని, భూ రికార్డుల పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని సూచించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో నరసాపురం ఆర్‌డీవో దాసి రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఎమ్మార్వో రాజ్ కిషోర్, మండల సర్వేయర్లు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపం “ సేల్ ” సోలార్ ప్రాజెక్టు






**మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి**
**బ్రాండ్ సీబీఎన్ వల్లే ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి పరుగులు**
**మాటిచ్చి చేతల్లో చూపే నాయకత్వంవల్లే పెట్టుబడుల వెల్లువ**
**క్లీన్ ఎనర్జీ వినియోగించడమే కాదు... దేశానికి ఎగుమతి చేస్తాం**
**సేల్ సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో మంత్రి నారా లోకేష్**

**జమ్మలమడుగు:బ్యూరో చీఫ్ మే 22నంది పత్రిక** ఈరోజు కేవలం ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం మాత్రమే కాదు, దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణ కలగలిసిన వేడుక అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3వేలకోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (సేల్ ) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... “మా నాన్న ఉత్తరం రాశారు.. మా తాత కల కన్నారు.. నేను ఆత్మలతో మాట్లాడాను అంటే నమ్మే వాళ్ళు ఎవరు లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి.” రెండింటికీ ఎంతో తేడా ఉందని అన్నారు.

**రాష్ట్రం చూపు.. జమ్మలమడుగు వైపు** మంత్రి లోకేష్ మాట్లాడుతూ...రికార్డ్ టైమ్ లో సేల్ ప్రాజెక్ట్ పూర్తి అయింది. ఇది స్థానిక రైతుల విజయం, జమ్మలమడుగు యువత విజయం. మీ సహకారం వల్లనే ఈ ప్రాజెక్ట్ 11 నెలల్లో పూర్తి అయింది. రాష్ట్రం మొతం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఈరోజు ఇతర నియోజకవర్గాల వాళ్ళు మాకు కూడా ఇటువంటి కంపెనీలు వస్తే బాగుంటుంది అనుకుంటున్నారు. ఇక్కడ మెగా సోలార్ పార్క్ ఏర్పాటు చేసింది మనమే. ఇప్పుడు సేల్ తీసుకువచ్చింది మనమే. అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో యన్టీపీసీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌లు తీసుకొచ్చింది మనమే. సేల్ రావడం వల్ల రైతులకు లబ్ధి జరిగింది, యువతకు ఉద్యోగాలు వచ్చాయి. కంపెనీలు తీసుకురావాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది ఒక్క మన బ్రాండ్ సీబీఎన్ గారికి మాత్రమే సాధ్యమని అన్నారు.

**విజయానికి మూడు మెట్లు**పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనలో ఏపీ విజయానికి ముఖ్యమైన మూడు కారణాలున్నాయి. అవి ఏంటంటే.. మొదటిది బ్రాండ్ సీబీఎన్. “పెట్టుబడిదారులు ఇప్పుడు మేము ఎంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రాగలం?” అని అడుగుతున్నారు. ఎందుకంటే, ఇచ్చిన మాటను చేతల్లో చూపే నాయకత్వంతో నిర్మితమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. మేము స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను నమ్ముతాం. నిర్ణయాలు వేగంగా తీసుకుని, ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసినప్పుడే విధానాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాజెక్టే అందుకు నిదర్శనం. ప్రాజెక్ట్ భూమిపూజ నుండి ప్రారంభోత్సవం వరకు రికార్డు స్థాయిలో 11 నెలల్లో పూర్తయింది. మూడవది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతమైంది. మాది డబుల్-ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. రాష్ట్రప్రభుత్వ దార్శనికతకు కేంద్ర ప్రభుత్వ మద్దతు తోడైనప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుంది.

**ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్ నిర్మాణం** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, అధునాతన తయారీ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తోంది. ఆధునిక ఆర్థిక వృద్ధి ఎకోసిస్టమ్స్, స్పెషలైజేషన్, ఆవిష్కరణల ద్వారానే సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వం కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల ఎకో సిస్టమ్స్ ను నిర్మిస్తున్నాయి. సేల్ నాయకత్వంతో మొట్టమొదటి సంభాషణ నాకు ఇప్పటికీ గుర్తుంది. ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సంఘం సమావేశం సందర్భంగా జరిగింది. అది పునరుత్పాదక ఇంధనానికి సంబంధించిన సమావేశం కూడా కాదు. కానీ ఆరోజు ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను నిర్మించాలనే తమ ప్రణాళికల గురించి సేల్ నాయకత్వం ఎంతో ఉద్వేగంగా మాట్లాడింది. వారి ఉద్దేశాన్ని నేను వెంటనే గ్రహించాను. రెన్యువబుల్ ఎనర్జీలో ఫలితాలను సాధించాలన్న సేల్ సంస్థ దీర్ఘకాలిక ఆలోచన, వారి తపనను నేను పసిగట్టగలిగాను.

**స్థానిక సమాజంతో కలసి ముందడుగు** పంజాబ్ లీడర్ షిప్ నేతృత్వంలో పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్ లో కార్యకలాపాలు నిర్వహించగలదా? అనే ప్రశ్న నాలో మెదిలింది. సేల్ బృందం అమరావతికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను నన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధమై, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రావడం నా ప్రశ్నకు జవాబు దొరికింది. సేల్ బృందం చక్కగా స్థానిక సమాజం, ప్రజలతో మమేకమయ్యారు. క్షేత్రస్థాయిలో గ్రామస్థులు, రైతులు, స్థానిక యంత్రాంగం, ఇంజనీర్లు, కార్మికులు, అధికారులతో కలిసికట్టుగా పనిచేశారు. వారు క్షేత్రస్థాయికి వచ్చి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని, స్థానికుల సహకారంతో ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టును విజయవంతం చేసింది.

**రికార్డువేగంతో ప్రాజెక్టు పూర్తి** సేల్ ₹3,000 కోట్ల పెట్టుబడి పెట్టి, 2,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వీనూ1, వీనూ2 భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం 11 నెలల్లో వేగవంతంగా పూర్తయి రికార్డు సృష్టించింది. పంజాబ్, రాజస్థాన్‌లోని సేల్ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అధునాతన టాప్‌కాన్ బైఫేషియల్ సోలార్ మాడ్యూల్స్ ఏర్పాటుచేశారు.

**11లక్షల టన్నుల కర్బన ఉద్గారాల తగ్గుదల** ఈ ఒక్క ప్రాజెక్ట్ ద్వారానే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన విద్యుత్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కుదిరిన 25 ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం జాతీయ గ్రిడ్‌లోకి సరఫరా అవుతుంది. ఈ విద్యుత్ గుజరాత్‌తో సహా ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, భారతదేశానికి ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుతోంది. భారతదేశ హరిత ఇంధన విప్లవానికి నాయకత్వం వహించడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. సేల్ బృందం మొత్తానికి, ముఖ్యంగా పంజాబ్ నుండి వచ్చిన మన సోదర సోదరీమణులకు నేను చెప్పేది ఒక్కటే. “తుస్సీ కమాల్ కర్ దిట్టా...చక్ దే ఫట్టే!” ఆంధ్రప్రదేశ్ మిమ్మల్ని కుటుంబ సభ్యులుగా స్వాగతిస్తోంది. క్రమశిక్షణ, పట్టుదల, వేగంతో ఎలా సాధించగలమో మీరు ఆచరణాత్మకంగా నిరూపించారు.

**నిర్మాణ సమయంలోనే వెయ్యిమందికి ఉపాధి** ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ-ఉపాధి లభించింది. వీరిలో 80 శాతం మంది స్థానికులే. వీరి ఆదాయాలు మెరుగయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా 760 మంది రైతులు, వారి కుటుంబాలు లబ్ధి పొందాయి. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ వ్యర్థాల నుండి దాదాపు 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేవి సేల్ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇవి రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పిస్తాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో ఇవి వేలాది ఉద్యోగాలను సృష్టిస్తాయి. సేల్ బృందం వారి రాబోయే ఐపీవో ప్రయాణంలో, భారతదేశం అంతటా వారి భవిష్యత్ విస్తరణ ప్రణాళికలలో గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాం. నిరాటంకమైన కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ కోసం మన స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలన్నీ పూర్తి మద్దతును కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. సేల్ సంస్థకు ఏ మద్దతు కావాలన్నా నేను ఒక్క వాట్సాప్ కాల్ దూరంలోనే ఉంటానని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, సేల్ కో-ఫౌండర్ & డైరెక్టర్ సుఖ్ భీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సీఈవో లక్షిత్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.







# పారాక్వాట్ గడ్డి మందు నిషేధం



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 22**: పారాక్వాట్ గడ్డి మందును ప్రభుత్వం పూర్తిగా నిషేధించినదని వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఎర్రగుంట్ల గ్రామంలో పురుగుల మందు దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రాణహాని కలిగించే ప్రమాదకరమైన పారాక్వాట్ డైక్లోరైడ్ అనే గడ్డి మందును దేశవ్యాప్తంగా నిషేధించాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, వైద్యులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన నిపుణుల కమిటీ ఈ రసాయనాన్ని పూర్తిగా నిషేధించాలని సిఫార్సు చేయడంతో ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకున్నట్లు ఏవో తెలిపారు. పత్తి, వరి మొక్కజొన్న పంటల లో కలుపు నివారణకు రైతులు ఈ గడ్డి మందులు వినియోగిస్తారని, తక్కువ ధరకే లభించడం సత్వరంగా ఫలితాలను ఇవ్వడం వల్ల దీనికి డిమాండ్ పెరిగిందని అన్నారు విషపూరితమైన ఈ గడ్డి మందును ఉపయోగించడం వల్ల వివిధ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని, కిడ్నీలు ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బ తినడం పార్కింగ్ సన్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ గడ్డి మందు ప్రభావం వల్ల నెలకు 20 మందికి పైగా రైతులు కూలీలు మరణిస్తున్నట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 2026 మే 22 నుంచి 60 రోజులపాటు గడ్డి మందు అమ్మకాలు వినియోగం నిల్వలపై నిషేధం విధించదని పేర్కొన్నారు. మండలంలో పురుగుల మందు దుకాణాలలో ఈ నిషేధిత పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందును అమ్మకాలు చేయకూడదని డీలర్లను ఏవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తారణ సిబ్బంది ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజును కలిసిన కోరుకొండ సైనిక్ స్కూల్ పేరెంట్స్



**విశాఖపట్నం బ్యూరో చీఫ్ మే 22 నంది పత్రిక** కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థుల పేరెంట్ ప్రతినిధి యుగంధర్ రావు శుక్రవారం నాడు విజయనగరం ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాలు గత రెండు సంవత్సరముల నుండి విద్యార్థులకు మంజూరు కావడం లేదని ఈ సమాచారాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆ విషయమై చర్చించి వీలైనంతవరకు వెంటనే ఉపకార వేతనాలు మంజూరు చేయవలసినదిగా వారు ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు కు వినతి పత్రం ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థుల ఉపకార వేతనాలు వెంటనే అందే విధంగా అధికారులతో మాట్లాడతామన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లా తీర ప్రాంతంలోని బీచ్ లను రాష్ట్రంలోనే ఉన్నత ప్రమాణాలు గల పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

## ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**నరసాపురం బ్యూరో చీఫ్ మే 22నంది పత్రిక** నరసాపురం రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో శుక్రవారం పశ్చిమ గోదావరి ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మొగల్తూరు మండల సముద్రతీర ప్రాంతాల్లోని మొళ్ళపర్రు, పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌ల పర్యాటక అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సముద్రతీర ప్రాంతాలను ఆధునిక పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి స్థానిక ప్రజలు సహకరించాలని కోరిన ఆయన, వ్యాపార వర్గాలకు ఇచ్చిన విధంగానే మత్స్యకారులకు కూడా భూములను లీజుకు ఇవ్వడానికి ప్రభుత్వం తరఫున అన్ని రకాల చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రజలు అపోహలు వీడి అభివృద్ధికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక యువకులు, పెట్టుబడిదారులకు తగిన నైపుణ్య శిక్షణ అందించేందుకు పర్యాటక శాఖ, పారిశ్రామిక శాఖ మరియు బ్యాంకింగ్ రంగాల ద్వారా సహకారం అందించబడుతుందని తెలిపారు. టూరిజం ప్రాజెక్టుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన టూరిజం పాలసీ ప్రకారం అందుబాటులో ఉన్న రాయితీలు, ప్రోత్సాహకాలను వినియోగించుకుని స్థానిక ప్రజలు తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. పేరుపాలెం బీచ్‌ను రాష్ట్రంలోనే ఉన్నత ప్రమాణాలు గల బీచ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని తెలిపారు. అదేవిధంగా, వివిధ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక ప్రజలు భాగస్వాములై ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నరసాపురం ఆర్‌డీవో దాసి రాజు, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి ఎ. వెంకట అప్పారావు, మొగల్తూరు తహసీల్దార్ రాజ్ కిషోర్, జనసేన నాయకులు బొమ్మిడి సునీల్, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మైల వసంతరావు, మత్స్యకార సంఘ ప్రతినిధులు తిరుమాని శ్రీను, తిరుమాని సత్యనారాయణ మరియు ఇతర మత్స్యకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# ఆరోగ్యం ముఖ్యం కాదు సేవ కాదు దోపిడీ

## ప్రభుత్వ హాస్పిటల్ లో నర్సుల శ్రమను ఆరోగ్యాన్ని జీవితాన్ని దోచుకునే వ్యవస్థ

**కర్నూలు నంది పత్రిక బ్యూరో..** సమాజంలో ఆర్థిక వ్యవస్థ పేరుతో కాంట్రాక్ట్ ఉద్యోగికి న్యాయం జరగక, శ్రమ దోపిడీ కొనసాగితే దాని ప్రభావం వ్యక్తిగతంగా మాత్రమే కాదు .కుటుంబం, సమాజం, ప్రభుత్వ వ్యవస్థల మీద కూడా పడుతుంది.ఉద్యోగి చేసిన పనికి తగిన జీతం, భద్రత, గౌరవం లేకపోతే అతనిలో నిరాశ పెరుగుతుంది.కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనపడుతుంది. పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రభావితమవుతాయి.ఒకే పని చేసినా రెగ్యులర్ ఉద్యోగికాంట్రాక్ట్ ఉద్యోగి మధ్య భారీ తేడాలు ఉంటే అసమానత పెరుగుతుంది.శ్రమకు గౌరవం లేకపోతే సమాజంలో అసంతృప్తి, ఆందోళనలు, నిరసనలు పెరిగే అవకాశం ఉంటుంది.చివరకు ప్రభుత్వ సేవల నాణ్యత కూడా తగ్గుతుంది, ఎందుకంటే ఉద్యోగి మానసికంగా ఒత్తిడిలో పనిచేయాల్సి వస్తుంది.కాబట్టి కాంట్రాక్ట్ ఉద్యోగులకు: సముచిత వేతనం,ఉద్యోగ భద్రత,సమాన పనికి సమాన వేతనం,సేవలకు గుర్తింపు,క్రమబద్ధీకరణ వంటి అంశాలు చాలా ముఖ్యమైనవి. ఇది కేవలం ఉద్యోగుల సమస్య మాత్రమే కాదు సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, శ్రమ గౌరవానికి సంబంధించిన విషయం కూడా. ప్రభుత్వ హాస్పిటల్ నందు నర్సులు మరియు సిబ్బంది నలిగిపోతున్నారు దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.




# ప్లాస్టిక్ రహిత మైదానాలు గా తీర్చిదిద్దాలి : శివసేన రెడ్డి

రాష్ట్రంలో అన్ని క్రీడా మైదానాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా సర్వ్ అండ్ సపోర్ట్- యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లాలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో అన్ని స్టేడియాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్ లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ స్టేడియంలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాలాదేవిలు హాజరైనారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు వారి తల్లిదండ్రులు కోచులు సిబ్బంది మైదానాలను ప్లే ఫీల్డ్ లను పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్ని స్టేడియాలను ప్లాస్టిక్ రహిత మైదానాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువజన క్రీడ వారోత్సవాలు నిర్వహిస్తూ, ప్రజల అభిప్రాయాన్ని క్రోడీకరించి క్రీడలు, యువజన అభివృద్ధికి ప్రణాళిక బద్ధమైన కృషి చేస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ.సోనీ బాలాదేవి, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. యువతతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజల నుండి ఈ కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు.

